ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

విశాఖపట్నం

జిల్లా వార్తలు

ఆదివారం 31 మార్చి 2024



సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీలకు పింఛన్ల పంపిణీ బాధ్యత

విశాఖపట్నం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): పెన్షన్ల పంపిణీకి వార్డు వలంటీర్లను దూరం పెట్టాలన్న కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల నేపథ్యంలో జీవీఎంసీ పరిధిలో ఆ బాధ్యత వార్డు సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీలకు అప్పగించాలని అధికారులు నిర్ణయించారు. జీవీఎంసీ పరిధిలో సామాజిక పెన్షన్‌దారులు 1.42 లక్షల మంది ఉన్నారు. వీటిని ఇప్పటివరకూ జీవీఎంసీ పరిధిలో ఉన్న సుమారు 10,798 మంది వార్డు వలంటీర్లు అందజేసేవారు. తాజాగా ఎన్నికల సంఘం ఆదేశాలతో వారి స్థానంలో జీవీఎంసీ పరిధిలోని 450 మంది వార్డు సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీలు పంపిణీ చేయనున్నారు.

నేడే చెన్నై సూపర్‌కింగ్స్, ఢిల్లీ క్యాపిటల్స్ మధ్య మ్యాచ్

రాత్రి 7.30 గంటలకు మ్యాచ్ ప్రారంభం



ఐపీఎల్ సమరం

ముస్తాబైన పీఎం పాలెం స్టేడియం

- వరుస విజయాలతో ఊపుమీద ఉన్న సీఎస్‌కే
- హోంగ్రౌండ్‌లో తొలి విజయంపై కన్నేసిన డీసీ
- ధోనీ క్రేజ్... ▸ హాట్‌కేకుల్లా అమ్ముడైన టికెట్లు

విశాఖపట్నం (స్పోర్ట్స్), మార్చి 30: చెన్నై సూపర్‌కింగ్స్, ఢిల్లీ క్యాపిటల్స్ మధ్య ఆదివారం జరిగే ఐపీఎల్ మ్యాచ్‌కు పోతిన మల్లయ్యపాలెంలోని ఏసీఏ-వీడీసీఏ స్టేడియం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. ఈ సీజన్‌లో తొలి రెండు మ్యాచ్‌లలో విజయం సాధించి మంచి ఊపుమీదున్న చెన్నై సూపర్‌కింగ్స్ ఉత్సాహంగా బరిలోకి దిగుతోంది. మరోవైపు తొలి రెండు మ్యాచ్‌లలో ఓటమి చెందిన ఢిల్లీ క్యాపిటల్స్ తమ హోమ్ గ్రౌండ్‌లోనైనా విజయం సాధించాలని పట్టుదలతో ఉంది.

ధోనీ క్రేజ్

ఈ సీజన్‌లో ఇప్పటివరకూ జరిగిన రెండు మ్యాచ్‌లలో ధోనీ బ్యాటింగ్ చేయలేదు. కేవలం కీపింగ్‌కు మాత్రమే పరిమితమయ్యాడు. రాయల్ చాలెంజర్స్ బెంగళూరుతో జరిగిన తొలి మ్యాచ్‌లో, గుజరాత్ టైటాన్స్‌లో జరిగిన రెండో మ్యాచ్‌లో కూడా ధోనీ బ్యాటింగ్ చేయలేదు. దీంతో ఆదివారం ఇక్కడ ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగే మ్యాచ్‌లో ధోనీ బ్యాటింగ్ చేస్తే చూడాలని అభిమానులు ఉవ్విళ్లూరుతున్నారు.

ఇప్పటికే అంతర్జాతీయ క్రికెట్‌కు గుడ్‌బై చెప్పిన టీమిండియా మాజీ సారథి మహేంద్ర సింగ్ ధోనీ దాదాపు ఐదేళ్ల తర్వాత విశాఖలో ఆడనుండడం, రానున్న ఐపీఎల్ సీజన్‌లో ఆడే అవకాశాలు తక్కువగా ఉండడం, ఐపీఎల్‌లో చెన్నై సూపర్‌కింగ్స్ బలమైన జట్టు కావడం వంటి అనేక కారణాలు ఈ మ్యాచ్‌పై క్రేజ్‌ను పెంచాయి. దీంతో టికెట్లు హాట్‌కేకుల్లా అమ్ముడుపోయాయి. ఆన్‌లైన్‌లో టికెట్లు లభించని క్రీడాభిమానులు కాంప్లిమెంటరీ పాస్‌ల కోసం యత్నిస్తున్నారు.

పిచ్‌పై అంచనాలు....

ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలోని పిచ్ (వికెట్)పై 200కు పైగా స్కోరు వచ్చే అవకాశాలున్నాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. అలాగే టాస్ కూడా కీలకం అవుతుందని భావిస్తున్నారు.

బార్ కోడ్ ఎంట్రీ

ప్రవేశ ద్వారాల వద్ద వైఫైతో కూడా స్కానర్ బోర్డులను ఏర్పాటుచేశారు. ప్రేక్షకులు టికెట్‌పై ఉన్న బార్ కోడ్‌ను స్కాన్ చేసి లోపలకు ప్రవేశించాల్సి ఉంటుంది. తోపులాట లేకుండా ఉండేందుకు మ్యాచ్ మొదలు కావడానికి రెండు గంటల ముందు నుంచి లోపలకు పంపించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

భారీ బందోబస్తు

మ్యాచ్ నేపథ్యంలో భారీ బందోబస్తును ఏర్పాటుచేశారు. మరోవైపు ఢిల్లీ క్యాపిటల్స్ యాజమాన్యం ప్రైవేటు సెక్యూరిటీని నియమించుకుంది. ప్రైవేటు సిబ్బందిని పూర్తిస్థాయిలో స్టేడియం లోపల వినియోగించునున్నారు. మ్యాచ్‌కు విపరీతమైన క్రేజ్ రావడంతో స్టేడియం బయట భారీసంఖ్యలో అభిమానులు గుమిగూడే అవకాశాలున్న నేపథ్యంలో పోలీసు సిబ్బంది ప్రత్యేక భద్రత చర్యలు చేపట్టనున్నారు.

ఇరు జట్లు సాధన

శనివారం ఇరుజట్ల ఆటగాళ్లు సాధన చేశారు. సాయంత్రం 4.30 గంటల ప్రాంతంలో చెన్నై సూపర్‌కింగ్స్, ఢిల్లీ క్యాపిటల్స్ ఆటగాళ్లు స్టేడియానికి చేరుకుని బ్యాటింగ్, బౌలింగ్ ప్రాక్టీసు చేశారు.

వైసీపీ సేవలో వలంటీర్లు

అధికార పార్టీ అభ్యర్థుల తరపున ప్రచారం

- తాయిలాల పంపిణీలో కీలకపాత్ర
- చోద్యం చూస్తున్న అధికారులు
- కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల నేపథ్యంలోనైనా స్పందిస్తారా?

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నంలో వార్డు వలంటీర్లు కొందరు హద్దు మీరి వ్యవహరిస్తున్నారు. వారిని ఎన్నికల విధులకు దూరంగా ఉంచాలని కేంద్ర ఎన్నికల సంఘం చాలా విస్పష్టంగా చెప్పింది. అయినా వారు లెక్క చేయడం లేదు. అధికార పార్టీ వైసీపీ నాయకుల వెనుక వార్డుల్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు. వార్డుల్లో నిర్వహించే సమావేశాలకు హాజరవుతున్నారు. కొందరైతే ఎన్నికల బహుమతుల పంపిణీలో కీలక పాత్ర పోషిస్తున్నారు.

విశాఖ తూర్పు, ఉత్తర నియోజకవర్గాల్లో ఇంటింటికీ వైసీపీ అభ్యర్థులు ఇటీవల చీరలు పంచిపెట్టారు. అదంతా వలంటీర్ల పర్యవేక్షణలోనే జరిగింది. ఈ రెండు నియోజకవర్గాల్లో కొందరు వలంటీర్లు అధికార పార్టీ కార్యాలయాల్లోనే ఉంటున్నారు. కొన్నిచోట్ల వలంటీర్ల వ్యవహారాలు పత్రికల్లో రాగా...రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశం మేరకు జిల్లా అధికారులు స్పందించి వారిని విధుల నుంచి తప్పించారు. ఈ నేపథ్యంలో వలంటీర్లను ఈ మూడు నెలలు ఉద్యోగాలకు రాజీనామా చేసి, ఎన్నికల పనులు చేయాలని వైసీపీ కార్పొరేటర్లు ఒత్తిడి చేస్తున్నారు. దీనికి భారీగా నజరానా ఇస్తామని, వైసీపీ మళ్లీ అధికారంలోకి వస్తే వలంటీర్లుగా తిరిగి తీసుకుంటామని హామీ ఇస్తున్నారు. వాస్తవానికి వలంటీర్లతో కార్పొరేటర్లు గానీ, నియోజకవర్గ అభ్యర్థులు, ఎమ్మెల్యేలు గానీ ఈ సమయంలో సమావేశాలు నిర్వహించడానికి వీల్లేదు. కానీ రహస్యంగా కళ్యాణ మండపాల్లో నిర్వహిస్తున్నారు. ఇవన్నీ ఉన్నతాధికారులకు తెలిసినా పెద్దగా పట్టించుకోవడం లేదు. అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. వలంటీర్లకు వైసీపీ అభ్యర్థులు ఇప్పటికే రెండు విడతలుగా రూ.10 వేలు చొప్పున రూ.20 వేలు నగదు పంపిణీ చేసినట్టు చెబుతున్నారు.

ఇప్పటికైనా స్పందిస్తారా?

తాజాగా కేంద్ర ఎన్నికల సంఘం వార్డు/గ్రామ వలంటీర్లపై మరికొన్ని ఆంక్షలు విధించింది. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి వారు ఇంటింటికీ తిరిగి పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉంది. అయితే వారికి ఆ బాధ్యతలు అప్పగించవద్దని స్పష్టంచేసింది. ఇప్పటికే వారికి ఏమైనా నిధులు అందించి ఉంటే వాటిని వెనక్కి తీసుకోవాలని సూచించింది. అంతేకాకుండా వారికి ఇచ్చిన మొబైల్ ఫోన్లు, ఇతర పరికరాలు వెనక్కి తీసుకోవాలని, ఎన్నికలు ముగిసేంత వరకు వాటిని ఇవ్వవద్దని ఆదేశించింది. సంక్షేమ పథకాల అమలులో వారిని దూరంగా ఉంచాలని హెచ్చరించింది. ఈ నేపథ్యంలో జీవీఎంసీ

... మిగతా 6వ పేజీలో



రాంపురంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వలంటీర్లు

నిబంధనలు పట్టించుకోవద్దు

- నా విజయానికి కృషిచేయండి
- వలంటీర్లతో ఎమ్మెల్యే అదీప్‌రాజ్ రహస్య సమావేశం
- ప్రచారపరంగా చేపట్టాల్సిన చర్యలపై చర్చ

పెందుర్తి, మార్చి 30: ఎన్నికల సంఘం ఆదేశాలను వైసీపీ నేతలు బేఖాతరు చేస్తున్నారు. ప్రచారానికి వలంటీర్లను దూరంగా ఉంచాలని నిర్దేశించినా, వారితోనే ఎన్నికలు నడిపించే దిశగా కసరత్తు చేస్తున్నారు. వారికి కానుకల ఆశలు చూపించి లొంగదీసుకుంటున్నారు. వచ్చేది మన ప్రభుత్వమేనని, ఇప్పుడు వలంటీరు పోస్టు నుంచి తొలగించినా, తిరిగి తీసుకుంటామని, కేసులు నమోదు చేసినా ఎత్తివేయిస్తామని హామీలు గుప్పిస్తున్నారు. ఈ క్రమంలో పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ శనివారం తన స్వగ్రామమైన రాంపురంలోని క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని వలంటీర్లతో రహస్య సమావేశం నిర్వహించారు. తన విజయం కోసం అహర్నిశలూ కృషిచేయాలని, ఎన్నికల నిబంధనలు, అధికారుల ఆదేశాలు పట్టించుకోనవసరం లేదని, తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చినట్టు సమాచారం. వలంటీర్ల పరిధిలో ప్రచారానికి చేపట్టాల్సిన చర్యలు, ఇంటింటికీ వెళ్లి వైసీపీకి ఓటు వేసేలా ఒప్పించేందుకు తగిన కార్యాచరణను

... మిగతా 6వ పేజీలో

టీడీపీ జిల్లా అధ్యక్షునిగా బాబ్జీ బాధ్యతల స్వీకారం



విశాఖపట్నం పార్లమెంటరీ పార్టీ నూతన అధ్యక్షుడు గండి బాబ్జీని అభినందిస్తున్న గంటా శ్రీనివాసరావు, ఎం.శ్రీభరత్, పల్లా శ్రీనివాసరావు, గణబాబు, వెలగపూడి రామకృష్ణబాబు, దువ్వారపు రామారావు, కృష్ణ, తదితరులు

- వార్త I పేజీలో

సవాళ్ల స్వీకరణకు సిద్ధంగా ఉండాలి

- అప్పుడే ఉన్నత స్థానానికి చేరుకునేందుకు అవకాశం
- యాక్సిస్ బ్యాంక్ సీఈవో అండ్ ఎండీ అమితాబ్ చౌదరి
- ఘనంగా ఐఐఎం విశాఖపట్నం ఎనిమిదో స్నాతకోత్సవం

- వార్త II పేజీలో



ఐఐఎంవీ స్నాతకోత్సవంలో ప్రసంగిస్తున్న యాక్సిస్ బ్యాంక్ సీఈవో అండ్ ఎండీ అమితాబ్ చౌదరి

నేడు 'మన పోలింగ్ బూత్-మన ఓటు'

- కలెక్టర్ మల్లికార్జున

విశాఖపట్నం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఓటర్లలో చైతన్యం తీసుకురావడానికి ఆదివారం 'మన పోలింగ్ బూత్-మన ఓటు' పేరుతో ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ఎ. మల్లికార్జున తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రతి పోలింగ్ బూత్ వద్ద బూత్ లెవెల్ అధికారులు అందుబాటులో ఉంటారని, ఓటర్లకు అన్ని విషయాలపై అవగాహన కల్పిస్తామన్నారు. ఓటర్లంతా తమ పరిధిలో పోలింగ్ కేంద్రాన్ని సందర్శించాలని ఆయన కోరారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా మే 13న జరగనున్న పోలింగ్‌లో ప్రతి ఓటరూ పాల్గొని ఓటింగ్ శాతం పెంపుదలకు సహకరించాలని పిలుపునిచ్చారు.

ప్రాణం ఉన్నంత వరకు టీడీపీలోనే...

- మాజీ మంత్రి బండారు వెల్లడి -IIలో

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (ఆది)	6.13
సహరి (సోమ)	4.36

పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్య దూరం

దాదాపు దశాబ్దన్నర కిందట 'బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ స్కీమ్' ప్రారంభం

- ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు కార్పొరేట్, ప్రైవేటు స్కూల్స్‌లో ఉచితంగా చదువుకునే అవకాశం
- విద్యార్థుల తరపున పాఠశాలలకు ఫీజును చెల్లిస్తూ వస్తున్న పాలకులు
- పుస్తకాలు, ఇతర సామగ్రి సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా సమకూరేలా చర్యలు
- గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఉమ్మడి జిల్లాలో 1,632 మందికి అడ్మిషన్లు
- వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత పథకం రద్దు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

నిరుపేదలైన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు కార్పొరేట్ విద్యను అందించాలన్న ఉద్దేశంతో గతంలో పాలకులు ప్రవేశపెట్టిన 'బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ స్కీమ్'ను వైసీపీ ప్రభుత్వం అటకెక్కించింది. 'అమ్మఒడి' పథకం కింద విద్యార్థులకు ఆర్థిక సహాయం చేస్తున్నందున...ఇక ఆ పథకం అవసరం లేదంటూ రద్దు చేసింది. దీంతో ఉమ్మడి విశాఖ జిల్లాలో వందలాది మంది ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన విద్యార్థులు కార్పొరేట్ స్కూల్స్‌లో చదువుకునే అవకాశాన్ని కోల్పోయారు.



'బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ స్కీమ్'లో భాగంగా ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు ఒకటి నుంచి పదో తరగతి వరకూ తమకు దగ్గరలోని ప్రైవేటు, కార్పొరేట్ స్కూల్స్‌లో ఉచితంగా చదువుకునే అవకాశాన్ని గత ప్రభుత్వాలు కల్పిస్తూ వచ్చాయి. ఒకటో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు ఎక్కువ వచ్చినట్టయితే...ఉన్న సీట్లను బట్టి లాటరీ ద్వారా అవకాశం కల్పించేవారు. అలాగే ఐదు, ఎనిమిది తరగతుల్లో ప్రవేశాలకు విద్యార్థులను రాత పరీక్ష ద్వారా ఎంపిక చేసేవారు. ఈ స్కీమ్‌కు ఎంపికైన విద్యార్థులకు ఏడాదికి రెసిడెన్షియల్ అయితే రూ.30 వేలు, నాన్ రెసిడెన్షియల్ అయితే రూ.20 వేలు చొప్పున ఫీజులను ప్రభుత్వమే చెల్లించేది. అలాగే, సాంఘిక సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో సదరు విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, షూ, యూనిఫామ్, ఇతర అవసరాలను సమకూర్చేది. ప్రభుత్వం చెల్లించే మొత్తాలకు అనుగుణంగా స్కూల్స్‌ను ఎంపిక చేసేవారు.

ఉమ్మడి విశాఖ జిల్లాలో గత తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలో 1,632 మంది విద్యార్థులు ఈ పథకంలో భాగంగా ప్రవేశాలు పొందారు. ఈ స్కీమ్‌ను వైసీపీ వచ్చిన తరువాత రద్దు చేయడంతో పలువురు విద్యార్థులు తల్లిదండ్రులు, దళిత హక్కుల సంక్షేమ సంఘం ప్రతినిధులు హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం ఈ పథకాన్ని ప్రస్తుతమున్న విద్యార్థులకు కొనసాగించాలంటూ తీర్పు ఇచ్చింది. దీంతో గత ప్రభుత్వ హయాంలో ప్రవేశాలు పొందిన వారికి మాత్రమే ఈ పథకాన్ని కొనసాగిస్తున్నారు.

నాణ్యమైన విద్య అందించాలని..

ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే ఉద్దేశంతో ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ఫీజుకు ప్రవేశాలు కల్పించేందుకు ముందుకువచ్చే స్కూల్స్‌లో పిల్లలను చేర్పిస్తారు. ఒక్కో క్లాస్‌లో కనీసం పది మందికి అవకాశం ఇచ్చేలా ఈ పథకాన్ని రూపొందించారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో ఈ పథకాన్ని అమలు చేసేందుకు 30కిపైగా స్కూల్స్‌కు ముందుకు రావడంతో వందలాది మంది విద్యార్థులు చదువుకునే అవకాశం ఏర్పడింది. వైసీపీ ప్రభుత్వం ఈ స్కీమ్‌ను పూర్తిగా నిర్వీర్యం చేయడంతో కొత్తగా అడ్మిషన్లు పొందలేని దుస్థితి

... మిగతా 6వ పేజీలో

రికార్డు స్థాయిలో పన్ను వసూళ్లు

- జీవీఎంసీకి ఆస్తి పన్ను, ఖాళీ స్థలాల పన్ను కలిపి రూ.433 కోట్లు వసూలు
- శనివారం ఒక్కరోజే రూ.20 కోట్లు
- నేడు మరో రూ.30 కోట్లు వచ్చే అవకాశం
- గత ఏడాది రూ.422.93 కోట్లు వసూలు
- ఈ ఏడాది లక్ష్యం రూ.450 కోట్లు



జీవీఎంసీ సౌకర్యం కేంద్రం వద్ద పన్నులు చెల్లించేందుకు క్యూ

విశాఖపట్నం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ విశాఖపట్నం మునిసిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ)కు ఈ ఆర్థిక సంవత్సరం ఆస్తి పన్ను రూపేణా రికార్డు స్థాయిలో ఆదాయం లభించింది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి ఆస్తి పన్ను, ఖాళీ స్థలాల పన్ను కలిపి రూ.450 కోట్లు వసూలు చేయాలని జీవీఎంసీ లక్ష్యంగా పెట్టుకుంది. శనివారం నాటికి రూ.433 కోట్లు వసూలైంది. ఇందులో రూ.20 కోట్లు శనివారం ఒక్కరోజే రావడం అధికారులను ఆశ్చర్యానికి గురిచేసింది. ఆర్థిక సంవత్సరం ముగియడానికి మరొక రోజు (ఆదివారం) ఉండడంతో ఇంకొక రూ.30 కోట్లు వరకూ పన్ను వసూలవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. అదే జరిగితే లక్ష్యానికి మించి పన్ను వసూలు అయినట్టేనని రెవెన్యూ విభాగం అధికారులు చెబుతున్నారు.

గత ఆర్థిక సంవత్సరంలో ఆస్తి పన్ను,

... మిగతా 6వ పేజీలో

ఘనంగా ఐఐఎం స్నాతకోత్సవం

- ముఖ్య అతిథిగా హాజరైన యాక్సిస్ బ్యాంక్ ఎండీ అండ్ సీఈవో అమితాబ్ చౌదరి
- కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు, ఇద్దరికి పీహెచ్‌డీ పట్టాలు ప్రదానం

విశాఖపట్నం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ విశాఖపట్నం (ఐఐఎంవీ) ఎనిమిదో స్నాతకోత్సవాన్ని శనివారం సాయంత్రం నోవాటెల్‌లో ఘనంగా నిర్వహించారు. వేడుకకు యాక్సిక్ బ్యాంక్ ఎండీ అండ్ సీఈవో అమితాబ్ చౌదరి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థుల నుద్దేశించి ప్రసంగించారు. నిరంతరం కొత్త విషయాలను నేర్చుకుంటేనే ఉన్నత స్థానానికి చేరే అవకాశం ఉంటుందన్నారు. ఐఐఎం బోర్డు ఆఫ్ గవర్నర్స్ ఛైర్మన్ హరి భార్టియా మాట్లాడుతూ భారత్ ప్రపంచంలో ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉందని, 2030 నాటికి మూడో స్థానానికి చేరుతుందన్నారు.ఐఐఎం డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం.చంద్రశేఖర్ ఐఐఎం సాధించిన ప్రగతిని వివరించారు. కార్యక్రమంలో పీహెచ్‌డీ ప్రొగ్రామ్ ఛైర్‌పర్సన్ ప్రొఫెసర్ అమిత్ శంకర్, పీజీపీ ప్రొగ్రామ్ ఛైర్‌పర్సన్ ప్రొఫెసర్ పీఆర్‌ఎస్ శర్మ, పీపీపీఈఎస్ ప్రొగ్రామ్ ఛైర్‌పర్సన్ ప్రొఫెసర్ ఎ.చక్రవర్తి, పీజీపీడీజీఎం ప్రొగ్రామ్ ఛైర్‌పర్సన్ ప్రొఫెసర్ నీనా పాండే, సిబ్బంది పాల్గొన్నారు. రెండేళ్ల మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ (ఎంబీఏ) పూర్తి చేసిన 267 మందితోపాటు వర్క్ ఎక్స్‌పీరి యన్స్ ఉన్న వారికి ప్రత్యేకంగా నిర్వహించిన పీజీపీఈఎక్స్ ప్రొగ్రామ్ పూర్తి చేసిన 17 మందికి, ప్రభుత్వ సంస్థల్లో పని చేస్తున్న వారి కోసం రూపొందించిన పీజీపీ డీజీఎం కోర్సు పూర్తి చేసిన 16 మందికి పట్టాలను ప్రదానం చేశారు. రెండేళ్ల ఎంబీఏ కోర్సు పూర్తి చేసిన 267 మంది విద్యా ర్థులు క్యాంపస్ సెలక్షన్స్‌లో వివిధ సంస్థల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు.

ర్యాంకర్లు వీరే...

రెండేళ్ల ఎంబీఏ కోర్సు(పీజీపీ) పూర్తి చేసిన వారిలో ఫస్ట్ ర్యాంకు సాధించిన బి.అంకిత్ శెట్టి, రెండో ర్యాంకు సాధించిన దుశ్యంత్ గుప్తా గోల్డ్ మెడల్ సాధించారు. మహిళల్లో స్తుతి సంగికి వాణికి రావ్‌మెమోరియల్ గోల్డ్ మెడల్‌ను ప్రదానం చేశారు. ఆల్ రౌండ్ ఫర్‌పార్మెన్స్ విభాగంలో దుశ్యంత్ గుప్తాకు గోల్డ్ మెడల్ దక్కింది.ఎగ్జిక్యూటివ్ కోసం నిర్వహించిన పీజీపీ ఈఎక్స్ ప్రొగ్రామ్‌లో అత్యుత్తమ ప్రతిభ చూపిన సత్య అప్పారావు గల్లా, వడ్డాది అభిమన్యు గోల్డ్ మెడల్ సాధించారు.డిజిటల్ గవర్నెన్స్ అండ్ మేనేజ్ మెంట్ (పీజీపీడీజీఎం) కోర్సులో సుషాంత్ కంద్వాల్, లోకేష్ గుప్తాకు గోల్డ్ మెడల్స్‌ను ప్రదానం చేశారు.


స్నాతకోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

సొంత కంపెనీ ఏర్పాటే లక్ష్యం



మాది ఒడిశాలోని జైపూర్. ఐఐఎంవీలో ఎంబీ పూర్తి చేసి, గోల్డ్ మెడల్ సాధించడం ఆనందంగా ఉంది. క్యాంపస్ సెలక్షన్స్ లో టాటా ఏఐజీలో రూ.90 లక్షల ప్యాకేజీతోఉద్యోగం సాధించా. ఎన్‌ఐటీ రూర్కెలా లో ఇంజనీరింగ్ చేశాను. రెండేళ్లపాటు ఇక్కడ నేర్చుకున్న అనేక విషయాలు జీవితంలో ఉన్నత స్థానాన్ని చేరుకునేందుకు దోహదపడతాయి.

- బి.అంకిత్‌శెట్టి, గోల్డ్ మెడల్ విజేత

ప్రణాళికతోనే గోల్డ్ మెడల్ సాధ్యమైంది



మాది హర్యానాలోని ఫరీదాబాద్. ఎంబీఏ విశాఖలో పూర్తిచే యడం ఆనందంగా ఉంది. క్యాంపస్ ఎంపికలో భాగంగా హెచ్ డీఎఫ్‌సీలో రూ.21 లక్షల ప్యాకే జీతో ఉద్యోగం వచ్చింది. యూనివర్శిటీ ఆఫ్ ఢిల్లీలో డిగ్రీ పూర్తి చేశాను. తల్లిదండ్రులు షాయ్ గుప్తా, లలిత గుప్తా ఎంతో ప్రోత్సహించారు. ప్రణాళిక తోపాటు ఫ్యాకల్టీ సహకారంతోనే సాధ్యమైంది.

- దుశ్యంత్ గుప్తా, గోల్డ్ మెడల్ విజేత

సమాజానికి రుణపడి ఉంటా



మాది మధ్య ప్రదేశ్ లోని భోపాల్. ఐఐఎంవీలో ఎంబీఏ పూర్తి చేయడం గర్వంగా ఉంది. సమాజానికి రుణపడి ఉండాలన్న విషయాన్ని ఇక్కడ నేర్చుకున్నా. క్యాంపస్ సెలక్షన్స్‌లో భాగంగా ఐసీఐసీఐ బ్యాంకులో రూ.17 లక్షల ప్యాకేజీతో ఉద్యోగం వచ్చింది. ఫ్యాకల్టీ ఎంతగానో సహకరించారు. ఒత్తిడికి గురవకుండా మెరుగైన ప్రదర్శన చేశా.

- స్తుతి సంఘి, గోల్డ్ మెడల్ విజేత

నిజాయితీపరులను ఎన్నుకోవాలి: సినీ హీరో సుమన్

సీతమ్మధార, మార్చి 30: కులం, మతం వర్ణ బేదాలు చూడకుండా నిజాయితీగా సేవ చేసే నాయకుడిని ఎన్నుకోవాలని సినీ హీరో సుమన్ సూచించారు. సీతమ్మధారలోని బీజేపీ కార్యాలయానికి సినీ హీరో సుమన్ విచ్చేసి ఉత్తర నియోజకవర్గంనుంచి పోటీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బీజేపీ రాష్ట ఉపాధ్యక్షులు విష్ణుకుమార్ రాజును అభినందించారు. ఈ సందర్భంగా సుమన్‌ను విష్ణుకుమార్ రాజు సత్కరించి పుష్పగుచ్ఛమిచ్చారు. అనంతరం సుమన్ మాట్లాడుతూ... ఉత్తరంలో విష్ణుకుమార్ రాజు ఎమ్మెల్యేగా పని చేసి అందరి మన్ననలు పొం దారని, మరోసారి పోటీలో ఉన్న ఆయనకు అభినందనలు తెలుపుతున్నట్లు సుమన్ పేర్కొన్నారు.


సుమన్‌ను పుష్పగుచ్ఛం అందిస్తున్న విష్ణుకుమార్ రాజు

ప్రచారంలో పాల్గొన్న ఆర్పీ, వలంటీర్లపై చర్యలు

జ్ఞానాపురం, మార్చి 30: ఎన్నికల నియమావళికి విరుద్ధంగా పార్టీ ప్రచారాల్లో పాల్గొన్న ఒక యూసీడీ ఆర్పీ, ఇద్దరు వలంటీర్లపై క్రమశిక్షణ చర్యలతోపాటు పోలీసు కేసులు నమోదు చేసినట్లు జోన్-5 జోనల్ కమిషనర్ ఆర్.జి.వి కృష్ణ ఒక ప్రకటలో తెలిపారు. ఎయిర్‌పోర్టు పోలీస్ స్టేషన్‌లో యూసీడీ ఆర్పీ అనురాధ, కంచరపాలెం పోలీసు స్టేషన్‌లో వలంటీర్ జి.గౌరి, మల్కాపురం స్టేషన్లలో వలంటీరు ఆర్.శ్రీదేవిలపై కేసులు నమోదయ్యాయి.

పాలుగొలుపు ఉత్సవం యాదవుల సంస్కృతికి ప్రతీక

సీతంపేట, మార్చి 30: యాదవుల సంస్కృతి, సంప్రదాయాలకు పాలుగొలుపు ఉత్సవం ప్రతీక అని తెలుగు దేశం విశాఖ పార్లమెంట్ అభ్యర్థి ఎం.శ్రీభరత్ పేర్కొన్నారు. సీతంపేటలో యాదవుల ఆధ్వర్యంలో జరిగిన పాలగొలుపు ఉత్సవంలో శ్రీభరత్, మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజుపాల్గొన్నారు. ఈ ఉత్సవంలో 12 రకాల పశుజాతులకు పూజలు నిర్వహించారు. అన్నదానంలో శ్రీభరత్ వడ్డన చేశారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు గండి బాబ్జీ, వార్డు టీడీపీ అధ్యక్షుడు నమ్మి రవికుమార్, బీజేపీ నాయకులు నరల బాలకృష్ణ, నార కిశోర్ పాల్గొన్నారు.


ఉత్సవంలో శ్రీభరత్, విష్ణుకుమార్‌రాజు

గండిబాబ్జీకి శుభాకాంక్షలు

మర్రిపాలెం: టీడీపీ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన గండి బాబ్జీ శనివారం స్థానిక పార్టీకార్యాలయంలో శనివారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈసందర్భంగా విశాఖ పార్లమెంట్ టీడీపీ ప్రధాన కార్యదర్శి పి. శ్రీనివాసరావు, 54వ వార్డు టీడీపీ అధ్యక్షుడు కార్తీక్‌కుట్టా,సంగువాసు,తాజుద్దీన్ గండి బాబ్జీని శుభాకాంక్షలు తెలిపారు.

రూ. 74 వేలు స్వాధీనం

పెందుర్తి, మార్చి 30: మండలంలోని సరిపల్లి వద్ద ఏర్పాటుచేసిన చెక్‌పోస్ట్ వద్ద శనివారం నిర్వహించిన వాహన తనిఖీల్లో రూ. 74 వేలు లభ్యమైంది. ఓ కోడిగుడ్ల వ్యాపారి కొత్తవలస నుంచి పెందుర్తి వైపు వ్యాన్‌లో వస్తుండగా పోలీసుల జరిపిన సోదాల్లో ఈనగదు పట్టుబడింది. ఆ వ్యాపారి వద్ద ఎటువంటి ఆధారాలు లేకపోవడంతో పోలీసులు ఈ నగదును సీజ్ చేశారు. ఎన్నికల నియమావళి అనుసరించి ఎవరివద్దనైనా రూ. 50వేలకు మించి ఉండరాదని సీఐరామకృష్ణ తెలిపారు.

హెచ్చరికలు బేఖాతరు

- డిప్యూటీ సీఎంతో అడ్డూరు వలంటీర్లు చెట్టాపట్టాల్
- చర్యలకు కూటమి నేతల డిమాండ్


నరసాపురం పెట్రోల్ బంకు వద్ద డిప్యూటీ సీఎంను కలిసిన వారిలో వలంటీర్లు

చోడవరం, మార్చి 30: ఎన్ని కల ప్రచారంలో పాల్గొన కూడదని ఒకపక్క అధికారులు హెచ్చరిస్తున్నప్పటికీ... వలంటీర్లు మాత్రం బేఖాతరు చేస్తున్నా రు. అనకాపల్లి లోక్‌సభ స్థానానికి వైసీపీ అభ్యర్థిగా బరిలో ఉన్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు శనివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా చోడవరం మండలం నరసాపురం వద్దకొద్దిసేపు ఆగారు. ఆయన్ను మండలంలోని అడ్డూరు, వెంకన్నపాలెం పంచాయతీలకు చెందిన వైసీపీ నాయకులు కలిసి ఎన్నికల గురించి చర్చించారు. అయితే అడ్డూరు పంచాయతీ నాయకులతో పాటు, ఆ పంచాయతీకి చెందిన పలువురు వలంటీర్లు కూడా డిప్యూటీ సీఎంను కలిసి ఎన్నికలపై మాట్లాడడం పలువురిని విస్మయానికి గురిచేసింది. అధికారుల ఆంక్షలను బేఖాతరు చేస్తూ డిప్యూటీ సీఎంను కలిసిన వలంటీర్లపై చర్యలు తీసుకోవాలంటూ టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

సివిల్ వ్యాజ్యాలపై వర్క్‌షాపు

విశాఖపట్నం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా లో అన్ని కోర్టుల్లో ఉన్న సివి ల్ వ్యాజ్యాలపై హైకోర్టు న్యాయమూర్తులు ఆధ్వర్యంలో జిల్లా కోర్టులో శనివారం వర్క్‌షాపు నిర్వ హించారు. విశాఖ జిల్లా పాలన జడ్జి జస్టిస్‌యు. దుర్గాప్రసాద్ అధ్యక్షతన కేసుల పరిష్కారంలో తీసుకోవాల్సిన సూచనలు, సలహాలందించారు. న్యాయమూర్తులు జస్టిస్ వీఆర్‌కే. కృపాసాగర్, జస్టిస్ వి. శ్రీని వాస్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జ్యుడిషియల్ అకాడమీ డైరెక్టర్ హరిహరనాథ శర్మ, విశాఖ జిల్లా ప్రిన్సిపల్ సెషన్స్‌జడ్జి ఆలపాటి గిరిధర్, పలు కోర్టుల జడ్జిలు పాల్గొన్నారు.


వేదికపై న్యాయమూర్తులు

ఎస్సీ సబ్‌ప్లాన్ నిధుల మళ్లింపు రాజ్యాంగ విరుద్ధం

టీడీపీ విశాఖ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి శ్రీభరత్

సీతంపేట, మార్చి 30: ఎస్సీల అభివృద్ధికి ఉద్దేశించిన ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులను దారిమళ్లించడం రాజ్యాంగ విరుద్ధమని తెలుగుదేశం పార్టీ విశాఖ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి ఎం.శ్రీభరత్ విమర్శించారు. శనివారం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో మాలమహానాడు, దళిత సేన, సామాజిక మార్పు సారథుల ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తలతో చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఈ సంస్థల రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పాల్తేటి పెంటరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి విచ్చేసిన శ్రీభరత్ మాట్లాడారు. రాష్టంలోని వైసీపీ ప్రభుత్వం కార్పొరేషన్ల ఏర్పాటు చేయడం తప్ప వాటితో ఒరిగిందేమీ లేదన్నారు. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ హక్కుల సాధన కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. విశాఖలో కొవిడ్ సమయంలో అందించిన సేవల్లో లోపాలను ప్రశ్నించిన డాక్టర్ సుధాకర్‌ను మతిస్థిమితం లేనివాడిగా చిత్రించి చివరకు ప్రాణాలు కోల్పోయేలా చేశారని, తూర్పు గోదావరి జిల్లాల్లో దళిత యువకుడిని హత్యచేసి డోర్ డెలివరీ చేశారని శ్రీభరత్ ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ, నాయకులు గిరిధర్, అప్పారావు, జాన్, ఎస్సీ నాయకులు పాల్గొన్నారు.


చర్చా వేదికలో మాట్లాడుతున్న శ్రీభరత్

ఉద్యోగుల సమస్యలపై ఐక్య పోరాటం

- ఏపీఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్షుడు శివారెడ్డి


సంఘ నాయకులను సన్మానిస్తున్న దృశ్యం

మహారాణిపేట, మార్చి 30: ఉద్యోగుల డిమాండ్ల సాధనకు ఐక్య పోరాటం అవసరమని ఏపీఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్షుడు కేవీ శివారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పురుషోత్తమ నాయుడు అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్‌జీవో సంఘం నూతన కార్యవర్గం ఎన్నికైన సందర్భంగా శని వారం స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలపై నిరంతరం కృషి చేస్తామన్నారు. రానున్న రోజుల్లో మెరుగైన 12వ పీఆర్‌సీ, పెండింగ్ సమస్యల పరిష్కారానికి ఉద్యోగులంతా సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈసందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులను ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో జిల్లా అధ్య క్షుడు ఈశ్వరరావు, జిల్లా కార్యదర్శి ఆర్ రవిశంకర్, వై నారాయణరావు , వీఆర్‌వీ సత్యనారాయణ, నగర శాఖ తాలుకా, రాష్ట్ర సంఘం నాయకులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

పేదల భవిష్యత్తు కోసమే పొత్తు

- జనసేన నాయకుడు వంశీకృష్ణ శ్రీనివాస్

అక్కయ్యపాలెం, మార్చి 30: టీడీపీ, బీజేపీ, జనసేన పొత్తు పేద ప్రజల భవిష్యత్తు కోసమేనని జనసేన పార్టీ దక్షిణ నియోజకవర్గ నేత వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. గ్రేటర్ 27వ వార్డులో వంశీకృష్ణ శ్రీనివాస్ ప్రచారం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ జోడెడ్లబండిలా నడవాలంటే చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రి చేయడం తప్ప మరే మార్గం లేదన్నారు. కార్పొరేటర్ గొలగాని వీరారావు, టీడీపీ, జనసేన అధ్యక్షులు అల్లూరి సత్యనారాయణరెడ్డి, గుండు సురేష్, అంగటి కుమార్, నియోజకవర్గ బీజేపీ కో కన్వీనర్ కారాల మహేష్, నాయకులు పి. లక్ష్మీ శివప్రసాద్, పీవీ రమణారావు, గురునాధరావు పాల్గొన్నారు.


ప్రచారంలో వంశీకృష్ణ శ్రీనివాస్

రూ. 2.58 కోట్ల ఆస్తిపన్ను వసూలు

జ్ఞానాపురం,మార్చి 30: జోన్-5 పరిధిలో రైల్వే ద్వారా రూ. 2.58 కోట్లు రెవెన్యూ అధికారులు వసూలు చేసినట్లు జోన్-5 జోనల్ కమిషనర్ ఆర్.జి.వి కృష్ణ తెలిపారు. ఇంత పెద్ద మొత్తంలో ఆస్తిపన్ను వసూలు చేసిన ఆర్.వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, ఆర్ఐ శ్రీనివాస్, ఇన్‌చార్జి అడ్మిన్ ఆనంద్‌లను జడ్సీ అభినందించారు. చెల్లింపు కేంద్రాలు ఆదివారం కూడా పనిచేస్తాయని ఆయన తెలిపారు.

'తిరుమల'లో అవగాహన సదస్సుకు అనూహ్య స్పందన


సదస్సులో మాట్లాడుతున్న తిరుమల విద్యాసంస్థల చైర్మన్ తిరుమలరావు

విశాఖపట్నం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): తగరపువలస సమీప తాళ్లవలసలోని తిరుమల విద్యాసంస్థల ప్రాంగణంలో జేఈఈ అడ్వాన్స్‌డ్, మెయిన్స్, నీట్ తదితర జాతీయ పరీక్షలపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొనడంతో విశేష స్పందన లభించిందని తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. ఈ సదస్సుకు సుమారు పది వేల మంది హాజరయ్యారన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీ పరీక్షలలో విజయం సాధించాలంటే ఏకాగ్రతతో కూడిన విద్యాభ్యాసం అవసరమన్నారు. ప్రస్తుత సమాజంలో విద్యార్థుల ప్రగతికి సోషల్ మీడియా అవరోధంగా మారిందని, మొబైల్ వినియోగించే సమయంలో తల్లి దండ్రులు తమ పిల్లలపై కొంచెం కఠినంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో రెసిడెంట్ డైరెక్టర్స్ కేఎస్‌వీవీ సత్యనారాయణ, ఎం.సత్యనారాయణ ఇమ్మృత్యుం జయరావు, ఫిజిక్స్ ప్రొఫెసర్ రజనీవర్మ, పేరెంట్ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు. అనివార్య కారణాలతో శనివారం నాటి సదస్సుకు హాజరుకాని వారు ఆదివారం రెసిడెంట్ డైరెక్టర్స్‌ను తాళ్లవలస క్యాంపస్‌లో కలిసి సందేహాలు నివృత్తి చేసుకోవచ్చునన్నారు.

'బ్రాహ్మణులకు టికెట్ల కేటాయింపులో నిర్లక్ష్యం'

మహారాణిపేట, మార్చి 30: బ్రాహ్మణులకు ఎన్నికల్లో టికెట్ల కేటాయింపులో రాజకీయ పార్టీలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని రాష్ట్రీయ విప్రవారధి చైర్మన్ నూకల సూర్య ప్రకాశ్ ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం మహారాణిపేట ఓ సమావేశమందిరంలో ని ర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో అసెంబ్లీ, లోక్‌సభ స్థానాల్లో బ్రాహ్మణులకు జనాభా నిష్పత్తి ప్ర కారం సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో రాజకీయ పార్టీలు పునరాలోచించుకోవాలని విజ్ఞప్తి చేశారు. అప్పటికీ స్పందించకుంటే నోటాకి ఓటు వేయాలని పిలుపుని స్తామని హెచ్చరించారు. బ్రాహ్మణులు అన్ని నియోజకవర్గాల్లో స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేసేందుకు వెనకాడమని హెచ్చరించారు.

పాలీసెట్ దరఖాస్తులకు గడువు ఏప్రిల్ 5

కంచరపాలెం, మార్చి 30 : పాలిటెక్నిక్ కామన్ ఎంట్రన్స్ టెస్టు (పాలీసెట్) -2024 దరఖాస్తు గడువు ఏప్రిల్ ఐదో తేదీతో ముగియనున్నది. ఇంటర్, పదో తరగతి పరీక్షలు ఇటీవల ముగియడంతో దరఖాస్తులు భారీ సంఖ్యలో వస్తున్నాయి. ఈ నేపథ్యంలో పాలీసెట్‌కు ఆన్‌లైన్ దరఖాస్తు గడువు ఏప్రిల్ ఐదో తేదీ సాయంకాలం 5గంటల వరకు అవకాశం ఉంది. ఏప్రిల్ 27వ తేదీన ప్రవేశ పరీక్ష జరగనుంది.

రేపటి నుంచి ఉచిత శిక్షణతరగతులు...

కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కళాశాలలో పాలీసెట్ దరఖాస్తుదారులకు ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ఉచిత శిక్షణ తరగతులను నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణ పేర్కొన్నారు. గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టుల్లో సీనియర్ అధ్యాపకులతో శిక్షణను అందించనున్నామన్నారు.

ఆస్తి పన్ను చెల్లింపు కేంద్రాల వద్ద రద్దీ

సీతంపేట, మార్చి 30: ఈ నెల 31వ తేదీలోగా ఆస్తి పన్ను కడితే వడ్డీ రాయితీ ప్రకటించడంతో జోన్ 3 జీవీఎంసీ కార్యాలయంలోని కౌంటర్ వద్ద జనం క్యూ కట్టారు. ఆదివారం కూడా ఆస్తి పన్ను చెల్లించే వీలుంది.

వైసీపీ సేవలో వలంటీర్లు

... 5వ పేజీ తరువాయి

అధికారులు, జిల్లా ఎన్నికల సంఘం కలిసి వలంటీర్లతో ఒక భారీ సమావేశం నిర్వహించాల్సిన అవసరం ఉంది. రాజకీయ పార్టీలకు అనుకూలంగా పనిచేసినా, వారితో కలిసి తిరిగినా విధుల నుంచి తొలగిస్తామని, తిరిగి తీసుకోబోమని స్పష్టంగా చెప్పాల్సి ఉంది. ఎవరైనా ప్రలోభాలకు గురిచేస్తే తమకు సమాచారం ఇవ్వాలని, వారిపై చర్యలు చేపడతామనో భరోసా కల్పించాల్సి ఉంది. ప్రత్యక్షంగా వారిని హెచ్చరించని పక్షంలో ఎన్నికల్లో అధికార పార్టీ తరపున వారు పనిచేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఇటువంటి సమయంలో ఎన్నికల సంఘం అండగా ఉంటుందని, ఏ వలంటీరు భయపడి వారికి పనిచేయాల్సిన అవసరం లేదని చెప్పాల్సిన బాధ్యత జిల్లా అధికారులపై ఉంది.

నిబంధనలు పట్టించుకోవద్దు

... 5వ పేజీ తరువాయి

సిద్ధం చేసి వారికి వివరించినట్టు తెలిసింది. మళ్లీ అధికారంలోకి వస్తామని, అప్పుడు అన్ని విధాలుగా మేలు చేస్తామని కూడా ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారంటున్నారు.

రాజయ్యపేట వలంటీర్ రాజీనామా

పెందుర్తి మండలం వాలిమెరక జుత్తాడ పరిధి రాజయ్యపేటకు చెందిన వలంటీరు సాయి రాజీనామా చేశాడని ఎంపీడీవో రవికుమార్ శనివారం తెలిపారు. పదిహేను రోజుల కిందటే సచివాలయ కార్యదర్శికి రాజీనామా లేఖ ఇచ్చాడని, అందులో తేదీ వేయకపోవడంతో ఇంతవరకూ ఆమోదించలేదన్నారు. ఈ వ్యవహారం తన దృష్టికి రావడంతో సిబ్బందిని మందలించి రెండు రోజుల కిందట రాజీనామాను ఆమోదించామన్నారు. అతను ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌కు అనధికారిక వ్యక్తిగత సహాయకుడిగా పనిచేస్తున్నట్టు సమాచారం. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తరువాత కూడా వైసీపీ ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్నాడని, దీనిపై ఆరోపణలు రావడంతోనే రాజీనామా చేశాడని సమాచారం.

పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్య దూరం

... 5వ పేజీ తరువాయి

ఏర్పడింది. హైకోర్టు ఆదేశాలతో గతంలో చేరిన విద్యార్థులకు మాత్రమే ప్రభుత్వం ఫీజులు చెల్లిస్తోంది. 2008లో ఈ పథకాన్ని ప్రారంభించగా, ఆ తరువాత వచ్చిన ప్రభుత్వాలు కొనసాగించాయి. ఈ స్కీమ్‌ను కొనసాగించడంతోపాటు ఫీజులను మరింత పెంచి ఉంటే జిల్లాలో సుమారు ఐదు వేల మంది విద్యార్థులకు ప్రైవేటు, కార్పొరేట్ స్కూల్స్‌లో చదువుకునే అవకాశం లభించి ఉండేదని విద్యార్థులు తల్లిదండ్రులు పేర్కొంటున్నారు.

పథకాన్ని పునరుద్ధరించాలి

- చింతాడ జోగారావు, దళిత హక్కుల సంఘం రాష్ట్ర ప్రెసిడెంట్

నిరుపేదలైన ఎస్సీ విద్యార్థుల కోసం బెస్ట్ అవైలబుల్ పథకాన్ని తీసుకువచ్చారు. ఈ పథకాన్ని వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేసింది. పోరాటం చేసినా పునరుద్ధరించ లేదు. ఉన్న వారికి కూడా ఆపేస్తామంటే కోర్టుకు వెళ్లాం. గతంలో చేరిన విద్యార్థులకు మాత్రమే ఈ పథకాన్ని కొనసాగిస్తున్నారు. అమ్మఒడి పేరుతో ఇచ్చే మొత్తానికి మరింత చేర్చి ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లలో నిరుపేదలైన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థులు ఉచితంగా చదువుకునే అవకాశాన్ని కల్పించాలి. ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. అమ్మఒడి పథకంలో భాగంగా ఇచ్చే మొత్తంతో కార్పొరేట్ స్కూళ్లలో చదువుకునే అవకాశం దక్కుతుందా?...ఈ విషయాన్ని ప్రభుత్వ పెద్దలే ఆలోచించాలి. ఈ పథకాన్ని పునరుద్ధరించిన వారిని గుర్తుంచుకుంటాం.

రికార్డు స్థాయిలో పన్ను వసూళ్లు

... 5వ పేజీ తరువాయి

ఖాళీ స్థలాల పన్ను కలిపి రూ.422.93 కోట్లు వసూలైంది. దీంతో పోల్చితే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.41 కోట్లు వరకూ అదనంగా వసూలవుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తంచేస్తున్నారు. ఈ నెల 31వ తేదీలోగా బకాయిలు (2023-24 ఆర్థిక సంవత్సరం మొదటి అర్ధ భాగానికి సంబంధించి పన్ను మొత్తం) చెల్లించిన వారికి వడ్డీ మాఫీ చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. దీనివల్ల ఆశించినదానికంటే అదనంగా పన్ను వసూలైందని జీవీఎంసీ అధికారులు విశ్లేషిస్తున్నారు. ఆదివారం సెలవు దినమైనప్పటికీ అన్ని జోనల్ కార్యాలయాలతోపాటు ప్రధాన కార్యాలయంలోని 'సౌకర్యం' కేంద్రాలు పనిచేస్తాయని డీసీఆర్ ఎస్.శ్రీనివాసరావు తెలిపారు.

ప్రభుత్వ స్థలంలో ఆక్రమణలు... అమ్మకాలు!

- అక్రమార్కుల బరితెగింపు
- పెందుర్తి కుమ్మరికాలనీలోని స్థలంపై కన్ను
- జిరాయితీ భూముల నంబర్లతో విక్రయాలు
- వైసీపీ నేతల అండతో రెచ్చిపోతున్న వైనం

పెందుర్తి, మార్చి 30: మండలంలో ప్రభుత్వ భూములు పరాధీనమవుతున్నాయి. జాగా కనిపిస్తే కబ్జా చేస్తున్నారు. కబ్జారాయుళ్లకు అధికార వైసీపీ నాయకులు అండగా నిలుస్తుండడంతో చర్యలు తీసుకునేందుకు అధికారులు వెనుకంజ వేస్తున్నారు. దీంతో అక్రమార్కులు మరింత బరితెగిస్తున్నారు. పులగాలిపాలెం, నల్లక్వారీ, కుమ్మరకాలనీ, అయ్యప్పనగర్ పరిధిలో ఆక్రమణ జాతర కొనసాగుతోంది. ఇక్కడి ప్రభుత్వ స్థలాన్ని కొంతమంది ఆక్రమించి దర్జాగా విక్రయించేస్తున్నారు. ఇక్కడి సర్వే సంఖ్య 98/277లో రెవెన్యూ రికార్డుల ప్రకారం సుమారు 20 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. రెండు దశాబ్దాల క్రితం సుమారు 250 మంది కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్స చేసుకున్న


కుమ్మరకాలనీ ప్రభుత్వ స్థలంలో పునాదులు

వారికి బహుమతిగా ఒక్కొక్కరికి 60 గజాలు చొప్పున ఇండ్ల స్థల పట్టాలను మంజూరు చేశారు. అయితే ఈ పట్టాలు చేతులు మారాయి. ఇదే అదనుగా ఆక్రమణదారులు రంగంలోకి దిగి తమకు పట్టాలున్నాయంటూ మిగిలిన ప్రభుత్వ భూమిని తమ చేతుల్లోకి తీసుకుని ఆక్రమించేశారు. అంతేకాకుండా సమీప జిరాయితీ భూముల సంఖ్యలతో తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి ప్రభుత్వ భూమిని విక్రయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలా విక్రయాలు జరిగి చేతుల మారిన వాటిలో పక్కా నిర్మాణాలు వెలిశాయి. దీంతో వాటిని రెవెన్యూ అధికారులు తొలగించారు. అయినా అక్రమార్కులు వెరవడం లేదు. కొంతమంది సిండికేట్‌గా ఏర్పడి అధికార పార్టీ నేతల అండతో మళ్లీ ఆక్రమణలకు తెగబడుతున్నారు. అంతేకాకుండా దిగువస్థాయి అధికారులు సహకారంతో ఇక్కడి స్థలాలకు హౌసింగ్ స్కీంకు అర్హత ఉందని పేర్కొంటూ విక్రయించేస్తున్నారు. కాగా ఆక్రమణదారుల మధ్య వివాదాలు నెలకొనడంతో ఈ వ్యవహారం బయటకు వచ్చింది. ఇక్కడి 20 ఎకరాల ప్రభుత్వ భూమిలో సుమారు మూడు ఎకరాలను ప్రజా ప్రయోజనాలకు వినియోగించారు. పది ఎకరాలకు పైగా ఆక్రమణల్లోకి వెళ్లిపోయిందని రెవెన్యూ వర్గాలే చెబుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకుని ప్రభుత్వ భూమిని పరిరక్షించాలని స్థానికులు కోరుతున్నారు. కాగా ఆక్రమణదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేశామని, ప్రభుత్వ భూమి పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నామని తహసీల్దార్ బంగార్రాజు వివరించారు.

టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి విజయం తథ్యం

- గాజువాక టీడీపీ అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు

గాజువాక, మార్చి 30: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి విజయం తథ్యమని గాజువాక అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 76వ వార్డులో శనివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దుర్మార్గ వైసీపీ ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయన్నారు. వైసీపీ అరాచక శక్తుల నుంచి రాష్ట్రాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో ప్రజలు సుఖ సంతోషాలతో ధైర్యంగా జీవనం సాగించారని, ఒక్క చాన్స్ అని అధికారంలోకి వచ్చిన జగన్ పాలనలో ప్రతి ఒక్కరు భయంగా బతుకుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జనసేన ఇన్‌చార్జి కోన తాతారావు మాట్లాడుతూ వైసీపీని ఓడించేందుకు ప్రతి ఒక్కరు కంకణం కట్టుకోవాలన్నారు. బీజేపీ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు మాట్లాడుతూ రాష్ట్రం బాగుండాలంటే కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కూటమి విజయం కీలకమన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు, నాయకులు తిప్పల రమణారెడ్డి, ప్రసాదుల శ్రీనివాసరావు, రౌతు గోవిందరావు, బొశెట్టి అప్పారావు, ఉగ్రం తదితరులు పాల్గొన్నారు.


ప్రచారంలో మాట్లాడుతున్న పల్లా శ్రీనివాసరావు


ప్రచారంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు

నాతయ్యపాలెంలో పల్లాకు ఘన స్వాగతం

అక్కిరెడ్డిపాలెం: పారిశ్రామిక చిత్రపటంలో గాజువాకకు ప్రత్యేక స్థానం లభించేలా చేయడమే తన ధ్యేయమని కూటమి అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు అన్నారు. నాతయ్యపాలెం బంగారమ్మ ఆలయం నుంచి శనివారం పల్లా నిర్వహించిన ప్రచారానికి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో పాటు స్థానికులు ఆయనకు అపూర్వ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పల్లా మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి తమ మానిఫెస్టోలోని సూపర్ సిక్స్‌తోనే సాధ్యమన్నారు. వైసీపీ అరాచక పాలనకు చరమగీతం పాడి రాష్ట్రాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పీఏసీ సభ్యుడు కోన తాతారావు, బీజేపీ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు, కార్పొరేటర్లు బొండా జగన్, గంధం శ్రీనివాస్, పల్లా శ్రీనివాస్, సర్వసిద్ధి అనంతలక్ష్మి, పులి రమణారెడ్డి, గడసాల అప్పారావు, అక్కిరెడ్డి శ్రీను, గోపిశెట్టి గోపి, బి.శ్రీరామ్మూర్తి, పల్లెల వెంకటరమణ, జి.మధులత తదితరులు పాల్గొన్నారు.

పల్లాకు మహిళల నీరాజనం

ఉక్కుటౌన్‌షిప్: గాజువాకలో పల్లా శ్రీనివాసరావు విజయం తథ్యమని, ఇందుకోసం కృషి చేస్తామని మహిళలు తెలిపారు. పార్టీ కార్యాలయంలో శనివారం పలు ప్రాంతాల మహిళలు పల్లాను కలిసి అభినందనలు తెలిపారు. టీడీపీ హయాంలోనే మహిళలకు మేలు జరిగిందని, వైసీపీ ప్రభుత్వంలో రక్షణ లేకుండా పోయిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సమన్వయ కర్త ప్రసాదుల శ్రీనివాస్, నేతలు రజిత, విజయ, భవాని, జ్యోతి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా

- పశ్చిమ వైసీపీ అభ్యర్థి ఆడారి ఆనంద్ కుమార్

గోపాలపట్నం, మార్చి 30: పశ్చిమ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించి, ఆదర్శంగా తీర్చిదిద్దుతానని వైసీపీ అభ్యర్థి ఆడారి ఆనంద్ కుమార్ అన్నారు. గ్రేటర్ 89వ వార్డు కొత్తపాలెంలోని పలు కాలనీల్లో శనివారం ఆయన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ప్రతి గడపకు వెళ్లి వైసీపీ అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి వైసీపీ అభ్యర్థులను అధిక మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి పనులను ప్రజలు తెలియజేశారు. అంతకుముందు అప్పలనరసయ్య కాలనీలోని ఆలయాల్లో ఆనంద్ పూజలు నిర్వహించారు. కార్యకర్తలు, అభిమానులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు అయితంశెట్టి రేణుకా గోపి, నేతలు దొడ్డి కిరణ్, ఆళ్ల పైడిరాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ప్రచారంలో భాగంగా ఓటు అభ్యర్థిస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్

దుర్గాపురంలో ఆనంద్‌కుమార్ సతీమణి ప్రచారం

ఎన్ఏడీ జంక్షన్: జీవీఎంసీ 57వ వార్డు దుర్గాపురంలో పశ్చిమ నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ సతీమణి మాలతి శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆమెకు మహిళలు హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసీపీ పాలనలోనే బలహీన వర్గాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం లభించిందని, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న జగన్‌ను మళ్లీ గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ముర్రువాణి, స్థానిక నేతలు పాల్గొన్నారు.


దుర్గాపురంలో ప్రచారం చేస్తున్న ఆడారి సతీమణి మాలతి

మల్కాపురంలో ఆనంద్ సోదరి...

మల్కాపురం: వైసీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని వైసీపీ అభ్యర్థి ఆడారి ఆనంద్ కుమార్ సోదరి ఎలమంచిలి మునిసిపల్ చైర్మన్ పీలా రమాకుమారి పేర్కొన్నారు. మల్కాపురం ఎస్సీకాలనీలో శనివారం ఆమె ఎన్నికల ప్రచారం చేశారు. అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాల వేసిన అనంతరం స్థానికుల సమస్యలు తెలుసుకుని, దశలవారీగా పరిష్కారిస్తామన్నారు. వైసీపీ అభ్యర్థులకు ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ విద్యార్థిని మృతిపై కొనసాగుతున్న విచారణ

కొమ్మాది, మార్చి 30: నగర పరిధిలోని కొమ్మాది చైతన్య పాలిటెక్నిక్ కళాశాలలో చదువుతున్న విద్యార్థిని బలవన్మరణంపై పీఎం పాలెం పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. బాలిక మృతికి కారణమైన గురువు ఎవరు, ఆయనకు సహకరించిన విద్యార్థులు, బాలిక ఫొటోలు ఎప్పుడు, ఎవరు, ఎలా తీశారు వంటి విషయాలను ఆరా తీస్తున్నారు. అలాగే బాలికతో పాటు ఇంకా ఎంతమంది లైంగిక వేధింపులకు గురవుతున్నారన్నది కూడా విచారిస్తున్నారు. విద్యార్థిని ఆత్మహత్యపై అన్ని పత్రికల్లోనూ రావడంతో పోలీసు ఉన్నతాధికారులు కూడా ఈ కేసుపై దృష్టిసారించారు. కళాశాల అధ్యాపకులతో పాటు హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థినులను, ల్యాబ్ టెక్నీషియన్లను స్టేషన్‌కు పిలిపించి విచారిస్తున్నారు. బాలికతో హాస్టల్‌లో ఉంటున్న వారిని కళాశాల హాస్టల్ వద్ద ఎస్ఐ సునీత విచారించగా, తరగతులు బోధించే అధ్యాపకులు, ల్యాబ్ టెక్నీషియన్లు, హాస్టల్ సిబ్బందిని పీఎంపాలెం స్టేషన్‌లో ఎస్ఐ సురేష్ విచారిస్తున్నారు. బాలికను ఇద్దరు విద్యార్థులు తరచూ కలిసేవారని, వారు బాలురు వసతి గృహంలో ఉంటారని సమాచారం లభించడంతో పోలీసులు వారిని కూడా విచారిస్తున్నారు. తరగతులు బోధించే వారిలో ఇద్దరు మాత్రమే పురుషులు కాగా ఐదుగురు మహిళలు ఉన్నారు. వారందరి ఫోన్లను స్వాధీనం చేసుకుని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. కాగా బాలిక ఆత్మహత్యకు కారణమైన వారిని కఠినంగా శిక్షించాలంటూ పీడీఎస్ఓ ఆధ్వర్యంలో శనివారం చైతన్య కళాశాల వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు వి.విశ్వనాథ్ మాట్లాడుతూ కళాశాల యాజమాన్యం, పోలీసులు చెబుతున్న విషయాల్లో వాస్తవం కనిపించడం లేదన్నారు. బాలిక ఆత్మహత్యపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు.



ఆందోళన వ్యక్తం చేస్తున్న పీడీఎస్‌వో సభ్యులు

కమనీయం... గణనాథుని కల్యాణోత్సవం

శ్రీనగర్, మార్చి 30: స్థానిక అఫీషియల్ కాలనీ సంపత్ వినాయక ఆలయ 15వ వార్షికోత్సవం సందర్భంగా శనివారం నిర్వహించిన గణనాథుని కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. అర్చకులు దార్లపూడి ప్రదీప్‌శర్మ ఉదయం సుప్రభాత సేవ, సామూహిక కుంకుమ పూజలు, లక్ష్మీ గణపతి, మహాలక్ష్మి, సర్వదేవత హోమాలు చేపట్టారు. అనంతరం సిద్ధి, బుద్ధి సమేత గణనాథుని కల్యాణం నిర్వహించారు. కల్యాణోత్సవం సందర్భంగా మధ్యాహ్నం నారాయణ సేవ నిర్వహించారు. సాయంత్రం పురవీధుల్లో ఉత్సవ విగ్రహాలను ఘనంగా ఊరేగించారు. ఆలయంలో మహిళలు కనకధారా స్తోత్ర పారాయణం చేశారు. ఈ కార్యక్రమంలో అక్కెన లక్ష్మణరావు, ఎం.మహాలక్ష్మి నాయుడు, సుబ్బరాజు, రాజు, సాయి, బాబ్జీ, జగన్నాథం, హనుమంతరావు, రమణమూర్తి, రామచంద్రరావు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

కన్నుల పండువగా విగ్రహాల ఊరేగింపు

పెదగంట్యాడ: జీవీఎంసీ 65వ వార్డు వాంబేకాలనీ శ్రీవెంకటేశ్వరాలయంలో ప్రతిష్ఠించనున్న విగ్రహాలకు శనివారం గ్రామోత్సవం (శోభాయాత్ర) నిర్వహించారు. శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి వారితో పాటు వివిధ అవతారాల విగ్రహాలను ఊరేగించారు. ఆలయ కమిటీ చైర్మన్ దొడ్డి రమణ, ధర్మకర్త మంత్రి మంజుల ఆధ్వర్యంలో ఊరేగింపు జరిగింది. ఇందులో భాగంగా స్వామివారి అవతారాలకు సంబంధించి వివిధ కళా రూపాలు ప్రదర్శించారు. తప్పెటగుళ్ళ, కోలాటలు, భజనలు ఏర్పాటు చేశారు. కాకతీయ జంక్షన్ నుంచి భానోజీతోట, ప్రియదర్శని కాలనీ, గిరిజాకాలనీ నుంచి వాంబే కాలనీ ఆలయం వరకు ఊరేగింపు జరిగింది. ఆలయ నిర్వాహక కమిటీ సభ్యులు పెంటకోట నాగేశ్వరరావు, శంకరరావు, మిట్టని అప్పలరెడ్డి, వై.అప్పలనారాయణ, పి.పైడిరాజు, ఆర్.వేణుగోపాలరావు, గొరుసు రామలక్ష్మి, తిప్పల స్వాతి, పొందురి రామారావు తదితరులు పాల్గొన్నారు. కాగా ఆదివారం నుంచి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు జరగనున్నాయి.

ఘనంగా త్రిశక్తి ఆలయ వార్షికోత్సవం

ఉక్కుటౌన్‌షిప్: స్టీల్‌ప్లాంట్ త్రిశక్తి అమ్మవార్ల ఆలయ వార్షికోత్సవం వైభవంగా జరుగుతోంది. శ్రీమహాలక్ష్మి, దుర్గ, సరస్వతి అమ్మవార్లను శనివారం ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలను పురవీధుల్లో ఊరేగించారు. ప్రధానార్చకుడు ఫణిశర్మ ఆధ్వర్యంలో కోలాటాల మధ్య కోలాహలంగా ఉత్సవాలు జరుగుతున్నాయి.


విగ్రహాలను ఊరేగిస్తున్న దృశ్యం

రూ.3.5 కోట్ల ఆస్తి పన్ను వసూలు


జోనల్ కమిషనర్‌కు చెక్కులు అందిస్తున్న అధికారులు

గాజువాక, మార్చి 30: గాజువాక జోనల్ పరిధిలో శనివారం ఒక్కరోజే రూ.3.5 కోట్ల ఆస్తి పన్ను వసూలయింది. వివిధ సంస్థలు, నివాసితుల నుంచి సేకరించిన చెక్కులను రెవెన్యూ అధికారులు రామ్‌నారాయణ, శ్రీకాంత్, ఆర్ఐలు సుభానీ, రెడ్డి మోహన్, శివ జోనల్ కమిషనర్ సన్యాసినాయుడుకు అందజేశారు. ఆదివారం కూడా కౌంటర్లు పనిచేస్తాయని, పన్ను చెల్లించవచ్చని జోనల్ కమిషనర్ తెలిపారు.

నేడు విద్యుత్ బిల్లుల చెల్లింపునకు వీలు

ఆటోనగర్, మార్చి 30: ఏపీ ఈపీడీసీఎల్ ఆపరేషన్స్ డివిజన్ జోన్-2లో ఆర్ఐవీ కలెక్షన్ సెంటర్లు ఆదివారం పనిచేస్తాయని అధికారులు తెలిపారు. గాజువాక ఈఆర్ఓ కార్యాలయం తెరిచి ఉంటున్న నేపథ్యంలో విద్యుత్ వినియోగదారులు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ విద్యుత్ బిల్లులను, బకాయి బిల్లులను చెల్లించుకోవచ్చన్నారు. ఈ సదుపాయాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని ఈఈ బీకె నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు.

'రాష్ట్ర ప్రభుత్వం తీరు దుర్మార్గం'

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 30: స్టీల్‌ప్లాంట్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తోందని సీఐటీయూ గౌరవాధ్యక్షుడు జె.అయోధ్యరామ్ అన్నారు. విద్యుత్ బిల్లుల బకాయిల చెల్లింపులో అధికారులు మొండి పట్టు పట్టడం సరికాదన్నారు. గతంలో స్టీల్‌ప్లాంట్ వద్ద మిగులు విద్యుత్ ఉంటే రాష్ట్ర ప్రభుత్వానికి అందించామని, కానీ ఉక్కు యాజమాన్యం ఎప్పుడూ అన్యాయంగా ప్రవర్తించలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి వివిధ పన్నుల రూపంలో రూ.కోట్లు చెల్లిస్తున్నామని, కానీ స్టీల్‌ప్లాంట్‌పై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందన్నారు.

నేడు మన పోలింగ్ బూత్ మన ఓటు

పెందుర్తి, మార్చి 30: మన పోలింగ్ బూత్ మన ఓటు కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించనున్నామని ఎన్నికల రిటర్నింగ్ అధికారి పి.శేషశైలజ తెలిపారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఆదివారం ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు బీఎల్వోలు, సూపర్‌వైజర్లు అందుబాటులో ఉంటారన్నారు. పోలింగ్ బూత్ పరిధిలోని ఓటర్ల జాబితాలో ఓటర్లంతా తమ ఓటును చూసుకునే అవకాశం ఉంటుందన్నారు.

నేడు త్రిమాత ఆలయ వార్షికోత్సవం

పెందుర్తిరూరల్, మార్చి 30: మండలంలోని చింతల అగ్రహారం, గవరపాలెం కాలనీ ప్రజల ఆరాధ్య దేవతలు బండిమాంబ, మెట్టమాంబ, దుర్గమాంబ (త్రిమాత) ఆలయం 14వ వార్షికోత్సవం ఆదివారం జరగనుంది. ఈ మేరకు నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం మహా నారాయణ సేవ ఉంటుందని ఆలయ కమిటీ చైర్మన్ మద్దాల శ్రీనివాసరావు తెలిపారు.

ఘనంగా ఇఫ్తార్ విందు


ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లింలు

గాజువాక, మార్చి 30: గాజువాక మదీనా మసీదు ఆధ్వర్యంలో శనివారం ఇఫ్తార్ విందు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సౌత్ ఏసీపీ టి.త్రినాథ్ మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు స్నేహపూర్వక వాతావరణాన్ని పెంపొందిస్తాయన్నారు. ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.

సినిమా గైడ్

- **టిల్లు స్క్వేర్ :** జగదాంబ, మెలోడి, శరత్, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), మోహిని, లక్ష్మీకాంత్ (గాజువాక), అరుణ (పెదగంట్యాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1 (పెందుర్తి), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **గాడ్జిల్లా వర్సెస్ కాంగ్ :** శారద, శ్రీవెంకటేశ్వర, కామేశ్వరి, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్, మోహిని (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి)
- **ఆడుజీవితం :** శ్రీలీలామహల్, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), గణేష్ (తగరపువలస)
- **ఓం భీం బుష్ :** సంగం, కామేశ్వరి, రమాదేవి, నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-2 (గాజువాక), తాతా (తగరపువలస)
- **ప్రేమలు :** శ్రీకన్య, దుర్గ (మధురవాడ), లక్ష్మీకాంత్ (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 23, టమాటా 18, వంకాయలు (తెలుపు) 22, వంకాయలు (నలుపు) 22, బెండకాయలు 22, పచ్చిమిర్చి 44, కాకరకాయలు 34, బీరకాయలు 40, ఆనపకాయ 12, కాలీఫ్లవర్ 22, క్యాబేజి 22, క్యారెట్ 28, దొండకాయలు 20, బంగాళదుంపలు 20, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 36, అల్లం (పాతది) 150, బరబాటి 26, ముల్లంగి 16, నిమ్మకాయలు (కిలో) 90, గోరుచిక్కుడు 30, దోసకాయలు 16, వె ల్లుల్లి (పెద్దవి) 160, కొబ్బరికాయ (పెద్దది) 22, బీన్స్ (పెన్సిల్) 54, ఆగాకర 52, పొటల్స్ 46, కీరదోస 24, కాప్సికమ్ 64, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 40, చిలగడదుంపలు 30 , కంద 60, దేముడు చిక్కుడు 64, కొండఉసిరి 90, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 55, బూడిద గుమ్మడికాయ 30, క్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 40.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	415
విజయనగరం	419
శ్రీకాకుళం	419

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	107
ఫారం ధర	--	127
విత్ స్కిన్	--	224
స్కిన్‌లెస్	--	234

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..

సైకిల్ గుర్తుకు ఓటేస్తేనే రాష్ట్రానికి భవిష్యత్తు

- ఎన్నికల ప్రచారంలో పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు


ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు, టీడీపీ శ్రేణులు

సింధియా, మార్చి 30: సైకిల్ గుర్తుపై ఓటు వేస్తేనే రాష్ట్ర ప్రజల భవిష్యత్తు మారుతుందని పశ్చిమ నియోజకర్గం ఎమ్మెల్యే, టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి గణబాబు అన్నారు. జీవీఎంసీ 63వ వార్డులోని పలు ప్రాంతాల్లో శనివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దుర్మార్గ వైసీపీ ప్రభుత్వాన్ని అంతం చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రజలు కోరుకునే మంచి ప్రభుత్వం మరికొద్ది రోజుల్లో రానుందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ గల్లా చిన్నా, నాయకులు రాజు, శ్రీను, కృష్ణ, మాధవరావు, అచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.

గండి బాబ్జీకి నేతల అభినందనలు


బాబ్జీని అభినందిస్తున్న పెదగంట్యాడ టీడీపీ నేతలు

పెదగంట్యాడ, మార్చి 30: విశాఖ పార్లమెంట్ టీడీపీ నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన గండి బాబ్జీని పెదగంట్యాడ టీడీపీ నాయకులు అభినందించారు. పార్టీ జిల్లా కార్యాలయంలో శనివారం బాబ్జీని కలిసి సత్కరించారు. విశాఖ పార్లమెంట్ టీడీపీ ఉపాధ్యక్షుడు పులి వెంకటరమణారెడ్డి, పెదగంట్యాడ మండల టీడీపీ కార్యాలయ కార్యదర్శి ములకలపల్లి పెంటయ్య, మండల టీడీపీ నాయకులు నామాల శ్రీకాంత్, దొమ్మేటి అప్పారావు, శ్రీమునిరి శ్రీనివాసరావు, కాకినాడ అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు పెదగంట్యాడలో టీడీపీ ప్రచారం

పెదగంట్యాడ, మార్చి 30: విశాఖ పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి శ్రీభరత్, గాజువాక టీడీపీ అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు ఆదివారం సాయంత్రం పెదగంట్యాడలో ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. జీవీఎంసీ 75వ వార్డు సీతానగరం ఎన్టీఆర్ జంక్షన్ నుంచి ప్రచారం ప్రారంభమవుతుందని వార్డు టీడీపీ అధ్యక్షుడు నమ్మి అప్పారావు ఒక ప్రకటనలో తెలిపారు.

'ఉక్కు'కు సొంత గనులు కేటాయించాలి

కూర్మన్నపాలెం, మార్చి 30: స్టీలుప్లాంట్‌కు సొంత గనులు కేటాయించి, పూర్తిస్థాయి ఉత్పత్తిని పునరుద్ధరించాలని జేఎంఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు వరసాల శ్రీనివాసరావు అన్నారు. కూర్మన్నపాలెం జంక్షన్‌లో ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు శనివారం 1143వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలలో పాల్గొన్న కార్మికులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ వర్కింగ్ క్యాపిటల్‌ను పెంచుకోవటానికి బ్యాంకుల ద్వారా రుణాలు ఇవ్వాలన్నారు. ప్రభుత్వ రంగాలు దేశానికి సైనికుల్లాంటివన్నారు. వాటిని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఉక్కు కర్మాగారం కోసం భూములిచ్చిన నిర్వాసితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ మాట్లాడుతూ విశాఖ ఉక్కును కాపాడుకోవడమే తక్షణ కర్తవ్యమన్నారు. కేంద్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో ప్రైవేటీకరణ ప్రక్రియను రద్దుచేసే వరకు కార్మికుల పోరాటం ఆగదన్నారు. ఉద్యోగులతో పాటు ప్రజలు, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు, మహిళలు, యువత పోరాటంలో భాగస్వాములు కావాలని పిలుపు నిచ్చారు.

క్విజ్ పోటీల్లో విజ్ఞాన్ ఫార్మసీ విద్యార్థుల ప్రతిభ

అగనంపూడి, మార్చి 30: క్విజ్ పోటీల్లో విజ్ఞాన్ విద్యార్థులు ప్రతిభ చూపారు ఇటీవల భీమవరం శ్రీవిష్ణు ఫార్మసీ కళాశాలలో జరిగిన మేథా- 2024 ఫార్మా క్విజ్ పోటీల్లో ఫార్మసీ విద్యార్థులు డి.పవన్‌కుమార్, ఎస్.శిరీష మొదటి స్థానంలో నిలవగా కె.అలేఖ్య, బి.విఘ్నేశ్ నాల్గో స్థానాన్ని కైవశం చేసుకున్నారు. బహుమతులు సాధించిన విద్యార్థులకు శనివారం కళాశాల ప్రిన్సిపాల్ వై.శ్రీనివాసరావు అభినందించారు. ఈ కార్యక్రమంలో అధ్యాప కులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

ఎన్నికల ప్రచారంలో వలంటీర్లు

గోపాలపట్నం, మార్చి 30: ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో వలంటీర్లు పాల్గొనడాన్ని నిషేధిస్తూ ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు జారీ చేసినా వలంటీర్లు మాత్రం నిబంధనలు బేఖాతరు చేస్తూ ప్రచార కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. ఇటీవల 92వ వార్డులో జీవీఎంసీ కో ఆప్షన్ మెంబర్ బెహరా భాస్కరరావు ఆధ్వర్యంలో ఇందిరానగర్, నరసింహనగర్ ప్రాంతాల్లో నిర్వహించిన ప్రచారంలో వలంటీర్ విద్యాసాగర్ పాల్గొన్నాడు. అతడిపై చర్యలు తీసుకోవాలని నియోజకవర్గ టీడీపీ నేతలు అధికారులకు ఫిర్యాదు చేశారు.


ప్రచారంలో వలంటీరు విద్యాసాగర్ (వృత్తంలో)

సందడిగా ఏసు పునరుద్ధాన పండుగ


రన్ ఫర్ జీసెస్ ర్యాలీలో పాల్గొన్న క్రైస్తవులు

గోపాలపట్నం, మార్చి 30: గుడ్ ఫ్రైడే అనంతరం నిర్వహించే పునరుద్ధాన పండుగను పురస్కరించుకుని శనివారం బాజీ జంక్షన్‌లోని ఎరూసలేము చర్చి ఆధ్వర్యంలో రన్ ఫర్ జీసెస్ ర్యాలీ నిర్వహించారు. ఎన్ఏడీ జంక్షన్ నుంచి గోపాలపట్నం బంక్ కూడలి వరకూ నిర్వహించిన ర్యాలీలో పాస్టర్ పీస్ ఏంజిల్ బ్లెస్సీ, రాజీ గ్రేస్, రాజు, పాస్టర్ కె.జాన్ లింగ్విస్టన్ సుధాకర్ పాల్గొన్నారు.

మల్కాపురం: గుడ్ ఫ్రైడేని పురస్కరించుకొని స్పిరిట్ ఆఫ్ యూనిట్ పాస్టర్స్ ఆధ్వర్యంలో శనివారం ర్యాలీ ఫర్ జీసెస్ నిర్వహించారు. ర్యాలీని పశ్చిమ వైసీపీ అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన ర్యాలీలో మోటర్ బైక్ ర్యాలీ చేశారు. ర్యాలీ సమాజానికి మంచి సందేశం ఇస్తుందన్నారు. ప్రతి ఒక్కరు శాంతి మార్గాన్ని అనుసరించాలని కోరారు. కార్యక్రమలో కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు, ఎస్‌బీ సింగ్, చింతా ప్రభాకర్, కె.ఇస్రాయల్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.

రూ. 74 వేలు స్వాధీనం

పెందుర్తి, మార్చి 30: మండలంలోని సరిపల్లి వద్ద ఏర్పాటుచేసిన చెక్‌పోస్ట్ వద్ద శనివారం నిర్వహించిన వాహన తనిఖీల్లో రూ. 74 వేలు లభ్యమైంది. ఓ కోడిగుడ్ల వ్యాపారి కొత్తవలస నుంచి పెందుర్తి వైపు వ్యాన్‌లో వస్తుండగా పోలీసుల జరిపిన సోదాల్లో ఈ నగదు పట్టుబడింది. ఆ వ్యాపారి వద్ద ఎటువంటి ఆధారాలు లేకపోవడంతో పోలీసులు ఈ నగదును సీజ్ చేశారు. ఎన్నికల నియమావళి అనుసరించి రూ. 50వేలకు మించి ఉండరాదని ఈ సందర్భంగా సీఐ ఎల్. రామకృష్ణ తెలిపారు.

ఘనంగా ఐఐఎం స్నాతకోత్సవం

» ముఖ్య అతిథిగా హాజరైన యాక్సిస్ బ్యాంక్ ఎండీ అండ్ సీఈవో అమితాబ్ చౌదరి

» కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు, ఇద్దరికి పీహెచ్‌డీ పట్టాలు ప్రదానం

విశాఖపట్నం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ విశాఖపట్నం (ఐఐఎంవీ) ఎనిమిదో స్నాతకోత్సవాన్ని శనివారం సాయంత్రం నోవాటెల్‌లో ఘనంగా నిర్వహించారు. వేడుకకు యాక్సిక్ బ్యాంక్ ఎండీ అండ్ సీఈవో అమితాబ్ చౌదరి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థుల నుద్దేశించి ప్రసంగించారు. నిరంతరం కొత్త విషయాలను నేర్చుకుంటేనే ఉన్నత స్థానానికి చేరే అవకాశం ఉంటుందన్నారు. ఐఐఎం బోర్డు ఆఫ్ గవర్నర్స్ ఛైర్మన్ హరి భార్టియా మాట్లాడుతూ భారత్ ప్రపంచంలో ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉందని, 2030 నాటికి మూడో స్థానానికి చేరుతుందన్నారు.ఐఐఎం డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం.చంద్రశేఖర్ ఐఐఎం సాధించిన ప్రగతిని వివరించారు. కార్యక్రమంలో పీహెచ్‌డీ ప్రోగ్రామ్ ఛైర్‌పర్సన్ ప్రొఫెసర్ అమిత్ శంకర్, పీజీపీ ప్రోగ్రామ్ ఛైర్‌పర్సన్ ప్రొఫెసర్ పీఆర్ఎస్ శర్మ, పీపీపీఈఎస్ ప్రోగ్రామ్ ఛైర్‌పర్సన్ ప్రొఫెసర్ ఎ.చక్రవర్తి, పీజీపీడీజీఎం ప్రోగ్రామ్ ఛైర్‌పర్సన్ ప్రొఫెసర్ నీనా పాండే, సిబ్బంది పాల్గొన్నారు. రెండేళ్ల మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ (ఎంబీఏ) పూర్తి చేసిన 267 మందితోపాటు వర్క్ ఎక్స్‌పీరి యన్స్ ఉన్న వారికి ప్రత్యేకంగా నిర్వహించిన పీజీపీఈఎక్స్ ప్రోగ్రామ్ పూర్తి చేసిన 17 మందికి, ప్రభుత్వ సంస్థల్లో పని చేస్తున్న వారి కోసం రూపొందించిన పీజీపీడీజీఎం కోర్సు పూర్తి చేసిన 16 మందికి పట్టాలను ప్రదానం చేశారు. రెండేళ్ల ఎంబీఏ కోర్సు పూర్తి చేసిన 267 మంది విద్యా ర్థులు క్యాంపస్ సెలక్షన్స్‌లో వివిధ సంస్థల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు.

ర్యాంకర్లు వీరే...

రెండేళ్ల ఎంబీఏ కోర్సు(పీజీపీ) పూర్తి చేసిన వారిలో ఫస్ట్ ర్యాంకు సాధించిన బి.అంకిత్ శెట్టి, రెండో ర్యాంకు సాధించిన దుశ్యంత్ గుప్తా గోల్డ్ మెడల్ సాధించారు. మహిళల్లో స్తుతి సంగికి వాణికి రావ్‌మెమోరియల్ గోల్డ్ మెడల్‌ను ప్రదానం చేశారు. ఆల్ రౌండ్ ఫర్‌పార్మెన్స్ విభాగంలో దుశ్యంత్ గుప్తాకు గోల్డ్ మెడల్ దక్కిందిఎగ్జిక్యూటివ్ కోసం నిర్వహించిన పీజీపీ ఈఎక్స్ ప్రోగ్రామ్‌లో అత్యుత్తమ ప్రతిభ చూపిన సత్య అప్పారావు గల్లా, వడ్లాది అభిమన్యు గోల్డ్ మెడల్ సాధించారు.డిజిటల్ గవర్నెన్స్ అండ్ మేనేజ్ మెంట్ (పీజీపీడీజీఎం) కోర్సులో సుషాంత్ కంద్వాల్, లోకేష్ గుప్తాకు గోల్డ్ మెడల్స్‌ను ప్రదానం చేశారు.


స్నాతకోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

సొంత కంపెనీ ఏర్పాటే లక్ష్యం



మాది ఒడిశాలోని జైపూర్. ఐఐఎంవీలో ఎంబీ పూర్తి చేసి, గోల్డ్ మెడల్ సాధించడం ఆనందంగా ఉంది. క్యాంపస్ సెలక్షన్స్ లో టాటా ఏఐజీలో రూ.90 లక్షల ప్యాకేజీతోఉద్యోగం సాధించా. ఎన్ఐటీ రూర్కెలా లో ఇంజనీరింగ్ చేశాను. రెండేళ్లపాటు ఇక్కడ నేర్చుకున్న అనేక విషయాలు జీవితంలో ఉన్నత స్థానాన్ని చేరుకునేందుకు దోహదపడతాయి.

- బి.అంకిత్‌శెట్టి, గోల్డ్ మెడల్ విజేత

ప్రణాళికతోనే గోల్డ్ మెడల్ సాధ్యమైంది



మాది హర్యానాలోని ఫరీదాబాద్. ఎంబీఏ విశాఖలో పూర్తిచే యడం ఆనందంగా ఉంది. క్యాంపస్ ఎంపికలో భాగంగా హెచ్ డీఎఫ్‌సీలో రూ.21 లక్షల ప్యాకే జీతో ఉద్యోగం వచ్చింది. యూనివర్శిటీ ఆఫ్ ఢిల్లీలో డిగ్రీ పూర్తి చేశాను. తల్లిదండ్రులు షాయ్ గుప్తా, లలిత గుప్తా ఎంతో ప్రోత్సహించారు. ప్రణాళిక తోపాటు ఫ్యాకల్టీ సహకారంతోనే సాధ్యమైంది.

- దుశ్యంత్ గుప్తా, గోల్డ్ మెడల్ విజేత

సమాజానికి రుణపడి ఉంటా



మాది మధ్య ప్రదేశ్‌లోని భోపాల్. ఐఐఎంవీలో ఎంబీఏ పూర్తి చేయడం గర్వంగా ఉంది. సమాజానికి రుణపడి ఉండాలన్న విషయాన్ని ఇక్కడ నేర్చుకున్నా. క్యాంపస్ సెలక్షన్స్‌లో భాగంగా ఐసీఐసీఐ బ్యాంకులో రూ.17 లక్షల ప్యాకేజీతో ఉద్యోగం వచ్చింది. ఫ్యాకల్టీ ఎంతగానో సహకరించారు. ఒత్తిడికి గురవకుండా మెరుగైన ప్రదర్శన చేశా.

- స్తుతి సంఘి, గోల్డ్ మెడల్ విజేత

నిజాయితీపరులను ఎన్నుకోవాలి: సినీ హీరో సుమన్


సుమన్‌ను పుష్పగుచ్ఛం అందిస్తున్న విష్ణుకుమార్ రాజు

సీతమ్మధార, మార్చి 30: కులం, మతం వర్గ భేదాలు చూడకుండా నిజాయితీగా సేవ చేసే నాయకుడిని ఎన్నుకోవాలని సినీ హీరో సుమన్ సూచించారు. సీతమ్మధారలోని బీజేపీ కార్యాలయానికి సినీ హీరో సుమన్ విచ్చేసి ఉత్తర నియోజకవర్గంనుంచి పోటీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు విష్ణుకుమార్ రాజును అభినందించారు. ఈ సందర్భంగా సుమన్‌ను విష్ణుకుమార్ రాజు సత్కరించి పుష్పగుచ్ఛమిచ్చారు. అనంతరం సుమన్ మాట్లాడుతూ... ఉత్తరంలో విష్ణుకుమార్ రాజు ఎమ్మెల్యేగా పని చేసి అందరి మన్ననలు పొందారని, మరోసారి పోటీలో ఉన్న ఆయనకు అభినందనలు తెలుపుతున్నట్టు సుమన్ పేర్కొన్నారు.

ప్రచారంలో పాల్గొన్న ఆర్‌పీ, వలంటీర్లపై చర్యలు

జ్ఞానాపురం, మార్చి 30: ఎన్నికల నియమావళికి విరుద్ధంగా పార్టీ ప్రచారాల్లో పాల్గొన్న ఒక యూసీడీ ఆర్‌పీ, ఇద్దరు వలంటీర్లపై క్రమశిక్షణ చర్యలతోపాటు పోలీసు కేసులు నమోదు చేసినట్లు జోన్-5 జోనల్ కమిషనర్ ఆర్.జీ.వి కృష్ణ ఒక ప్రకటలో తెలిపారు. ఎయిర్‌పోర్టు పోలీస్ స్టేషన్‌లో యూసీడీ ఆర్‌పీ అనురాధ, కంచరపాలెం పోలీసు స్టేషన్‌లో వలంటీర్ జి.గౌరి, మల్కాపురం స్టేషన్లలో వలంటీరు ఆర్.శ్రీదేవిలపై కేసులు నమోదయ్యాయి.

పాలుగొలుపు ఉత్సవం యాదవుల సంస్కృతికి ప్రతీక


ఉత్సవంలో శ్రీభరత్, విష్ణుకుమార్‌రాజు

సీతంపేట, మార్చి 30: యాదవుల సంస్కృతి, సంప్రదాయాలకు పాలుగొలుపు ఉత్సవం ప్రతీక అని తెలుగుదేశం విశాఖ పార్లమెంట్ అభ్యర్థి ఎం.శ్రీభరత్ పేర్కొన్నారు. సీతంపేటలో యాదవుల ఆధ్వర్యంలో జరిగిన పాలగొలుపు ఉత్సవంలో శ్రీభరత్, మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజుపాల్గొన్నారు. ఈ ఉత్సవంలో 12 రకాల పశుజాతులకు పూజలు నిర్వహించారు. అన్నదానంలో శ్రీభరత్ వడ్డన చేశారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు గండి బాబ్జీ, వార్డు టీడీపీ అధ్యక్షుడు నమ్మి రవికుమార్, బీజేపీ నాయకులు నరల బాలకృష్ణ, నార కిశోర్ పాల్గొన్నారు.

గండిబాబ్జీకి శుభాకాంక్షలు

మర్రిపాలెం: టీడీపీ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన గండి బాబ్జీ శనివారం స్థానిక పార్టీకార్యాలయంలో శనివారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈసందర్భంగా విశాఖ పార్లమెంట్ టీడీపీ ప్రధాన కార్యదర్శి పి. శ్రీనివాసరావు, 54వ వార్డు టీడీపీ అధ్యక్షుడు కార్తీక్‌కుట్బా,సంగువాసు,తాజుద్దీన్ గండి బాబ్జీని శుభాకాంక్షలు తెలిపారు.

రూ. 74 వేలు స్వాధీనం

పెందుర్తి, మార్చి 30: మండలంలోని సరిపల్లి వద్ద ఏర్పాటుచేసిన చెక్‌పోస్టు వద్ద శనివారం నిర్వహించిన వాహన తనిఖీల్లో రూ. 74 వేలు లభ్యమైంది. ఓ కోడిగుడ్ల వ్యాపారి కొత్తవలస నుంచి పెందుర్తి వైపు వ్యాన్‌లో వస్తుండగా పోలీసుల జరిపిన సోదాల్లో ఈనగదు పట్టుబడింది. ఆ వ్యాపారి వద్ద ఎటువంటి ఆధారాలు లేకపోవడంతో పోలీసులు ఈ నగదును సీజ్ చేశారు. ఎన్నికల నియమావళి అనుసరించి ఎవరివద్దనైనా రూ. 50వేలకు మించి ఉండరాదని సీఐరామకృష్ణ తెలిపారు.

హెచ్చరికలు బేఖాతరు

» డిప్యూటీ సీఎంతో అడ్డూరు వలంటీర్లు చెట్టాపట్టాల్

» చర్యలకు కూటమి నేతల డిమాండ్


నరసాపురం పెట్రోల్ బంకు వద్ద డిప్యూటీ సీఎంను కలిసిన వారిలో వలంటీర్లు

చోడవరం, మార్చి 30: ఎన్నికల ప్రచారంలో పాల్గొన కూడదని ఒకపక్క అధికారులు హెచ్చరిస్తున్నప్పటికీ... వలంటీర్లు మాత్రం బేఖాతరు చేస్తున్నారు. అనకాపల్లి లోక్‌సభ స్థానానికి వైసీపీ అభ్యర్థిగా బరిలో ఉన్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు శనివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా చోడవరం మండలం నరసాపురం వద్దకొద్దిసేపు ఆగారు. ఆయన్ను మండలంలోని అడ్డూరు, వెంకన్నపాలెం పంచాయతీలకు చెందిన వైసీపీ నాయకులు కలిసి ఎన్నికల గురించి చర్చించారు. అయితే అడ్డూరు పంచాయతీ నాయకులతో పాటు, ఆ పంచాయతీకి చెందిన పలువురు వలంటీర్లు కూడా డిప్యూటీ సీఎంను కలిసి ఎన్నికలపై మాట్లాడడం పలువురిని విస్మయానికి గురిచేసింది. అధికారుల ఆంక్షలను బేఖాతరు చేస్తూ డిప్యూటీ సీఎంను కలిసిన వలంటీర్లపై చర్యలు తీసుకోవాలంటూ టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

సివిల్ వ్యాజ్యాలపై వర్క్‌షాపు


వేదికపై న్యాయమూర్తులు

విశాఖపట్నం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా లో అన్ని కోర్టుల్లో ఉన్న సివిల్ వ్యాజ్యాలపై హైకోర్టు న్యాయమూర్తులు ఆధ్వర్యంలో జిల్లా కోర్టులో శనివారం వర్క్‌షాపు నిర్వహించారు. విశాఖ జిల్లా పాలన జడ్జి జస్టిస్‌యు. దుర్గాప్రసాద్ అధ్యక్షతన కేసుల పరిష్కారంలో తీసుకోవాల్సిన సూచనలు, సలహాలందించారు. న్యాయమూర్తులు జస్టిస్ వీఆర్‌కే. కృపాసాగర్, జస్టిస్ వి. శ్రీనివాస్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జ్యుడిషియల్ అకాడమీ డైరెక్టర్ హరిహరనాథ శర్మ, విశాఖ జిల్లా ప్రిన్సిపల్ సెషన్స్‌జడ్జి ఆలపాటి గిరిధర్, పలు కోర్టుల జడ్జిలు పాల్గొన్నారు.

ఎస్సీ సబ్‌ప్లాన్ నిధుల మళ్లింపు రాజ్యాంగ విరుద్ధం

టీడీపీ విశాఖ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి శ్రీభరత్


చర్చా వేదికలో మాట్లాడుతున్న శ్రీభరత్

సీతంపేట, మార్చి 30: ఎస్సీల అభివృద్ధికి ఉద్దేశించిన ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులను దారిమళ్లించడం రాజ్యాంగ విరుద్ధమని తెలుగుదేశం పార్టీ విశాఖ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి ఎం.శ్రీభరత్ విమర్శించారు. శనివారం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో మాలమహానాడు, దళిత సేన, సామాజిక మార్పు సారథుల ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తలతో చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఈ సంస్థల రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పాల్తేటి పెంటరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి విచ్చేసిన శ్రీభరత్ మాట్లాడారు. రాష్ట్రంలోని వైసీపీ ప్రభుత్వం కార్పొరేషన్ల ఏర్పాటు చేయడం తప్ప వాటితో ఒరిగిందేమీ లేదన్నారు. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ హక్కుల సాధన కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. విశాఖలో కొవిడ్ సమయంలో అందించిన సేవల్లో లోపాలను ప్రశ్నించిన డాక్టర్ సుధాకర్‌ను మతిస్థిమితం లేనివాడిగా చిత్రించి చివరకు ప్రాణాలు కోల్పోయేలా చేశారని, తూర్పు గోదావరి జిల్లాల్లో దళిత యువకుడిని హత్యచేసి డోర్ డెలివరీ చేశారని శ్రీభరత్ ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ, నాయకులు గిరిధర్, అప్పారావు, జాన్, ఎస్సీ నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలపై ఐక్య పోరాటం

» ఏపీఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్షుడు శివారెడ్డి


సంఘ నాయకులను సన్మానిస్తున్న దృశ్యం

మహారాణిపేట, మార్చి 30: ఉద్యోగుల డిమాండ్ల సాధనకు ఐక్య పోరాటం అవసరమని ఏపీఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్షుడు కేవీ శివారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పురుషోత్తమ నాయుడు అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్‌జీవో సంఘం నూతన కార్యవర్గం ఎన్నికైన సందర్భంగా శని వారం స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలపై నిరంతరం కృషి చేస్తామన్నారు. రానున్న రోజుల్లో మెరుగైన 12వ పీఆర్‌సీ, పెండింగ్ సమస్యల పరిష్కారానికి ఉద్యోగులంతా సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈసందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులను ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో జిల్లా అధ్య క్షుడు ఈశ్వరరావు, జిల్లా కార్యదర్శి ఆర్ రవిశంకర్, వై నారాయణరావు , వీఆర్‌వీ సత్యనారాయణ, నగర శాఖ తాలుకా, రాష్ట్ర సంఘం నాయకులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

పేదల భవిష్యత్తు కోసమే పొత్తు

» జనసేన నాయకుడు వంశీకృష్ణ శ్రీనివాస్


ప్రచారంలో వంశీకృష్ణ శ్రీనివాస్

అక్కయ్యపాలెం, మార్చి 30: టీడీపీ, బీజేపీ, జనసేన పొత్తు పేద ప్రజల భవిష్యత్తు కోసమేనని జనసేన పార్టీ దక్షిణ నియోజకవర్గ నేత వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. గ్రేటర్ 27వ వార్డులో వంశీకృష్ణ శ్రీనివాస్ ప్రచారం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ జోడెడ్లబండిలా నడవాలంటే చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రి చేయడం తప్ప మరే మార్గం లేదన్నారు. కార్పొరేటర్ గొలగాని వీరారావు, టీడీపీ, జనసేన అధ్యక్షులు అల్లూరి సత్యనారాయణరెడ్డి, గుండు సురేష్, అంగటి కుమార్, నియోజకవర్గ బీజేపీ కో కన్వీనర్ కారాల మహేష్, నాయకులు పి. లక్ష్మీ శివప్రసాద్, పీవీ రమణారావు, గురునాదరావు పాల్గొన్నారు.

రూ. 2.58 కోట్ల ఆస్తిపన్ను వసూలు

జ్ఞానాపురం,మార్చి 30:జోన్-5 పరిధిలో రైల్వే ద్వారా రూ. 2.58 కోట్లు రెవెన్యూ అధికారులు వసూలు చేసినట్టు జోన్-5 జోనల్ కమిషనర్ ఆర్.జీ.వి కృష్ణ తెలిపారు. ఇంత పెద్ద మొత్తంలో ఆస్తిపన్ను వసూలు చేసిన ఆర్.వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, ఆర్ఐ శ్రీనివాస్, ఇన్‌చార్జి అడ్మిన్ ఆనంద్‌లను జడ్సీ అభినందించారు. చెల్లింపు కేంద్రాలు ఆదివారం కూడా పనిచేస్తాయని ఆయన తెలిపారు.

'తిరుమల'లో అవగాహన సదస్సుకు అనూహ్య స్పందన


సదస్సులో మాట్లాడుతున్న తిరుమల విద్యాసంస్థల చైర్మన్ తిరుమలరావు

విశాఖపట్నం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి):తగరపువలస సమీప తాళ్లవలసలోని తిరుమల విద్యాసంస్థల ప్రాంగణంలో జేఈఈ అడ్వాన్స్‌డ్, మెయిన్స్, నీట్ తదితర జాతీయ పరీక్షలపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొనడంతో విశేష స్పందన లభించిందని తిరుమల విద్యాసంస్థల చైర్మన్‌ నున్న తిరుమలరావు తెలిపారు. ఈ సదస్సుకు సుమారు పది వేల మంది హాజరయ్యారన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీ పరీక్షలలో విజయం సాధించాలంటే ఏకాగ్రతతో కూడిన విద్యాభ్యాసం అవసరమన్నారు. ప్రస్తుత సమాజంలో విద్యార్థుల ప్రగతికి సోషల్ మీడియా అవరోధంగా మారిందని, మొబైల్ వినియోగించే సమయంలో తల్లి దండ్రులు తమ పిల్లలపై కొంచెం కఠినంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో రెసిడెంట్ డైరెక్టర్స్ కేఎస్‌వీవీ సత్యనారాయణ, ఎం.సత్యనారాయణ ఇ.మృత్యుం జయరావు, ఫిజిక్స్ ప్రొఫెసర్ రజనీవర్మ, పేరెంట్ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు. అనివార్య కారణాలతో శనివారం నాటి సదస్సుకు హాజరుకాని వారు ఆదివారం రెసిడెంట్ డైరెక్టర్స్‌ను తాళ్లవలస క్యాంపస్‌లో కలిసి సందేహాలు నివృత్తి చేసుకోవచ్చునన్నారు.

'బ్రాహ్మణులకు టికెట్ల కేటాయింపులో నిర్లక్ష్యం'

మహారాణిపేట, మార్చి 30: బ్రాహ్మణులకు ఎన్నికల్లో టికెట్ల కేటాయింపులో రాజకీయ పార్టీలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని రాష్ట్రీయ విప్రవారధి చైర్మన్ నూకల సూర్య ప్రకాశ్ ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం మహారాణిపేట ఓ సమావేశమందిరంలో ని ర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో అసెంబ్లీ, లోక్‌సభ స్థానాల్లో బ్రాహ్మణులకు జనాభా నిష్పత్తి ప్ర కారం సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో రాజకీయ పార్టీలు పునరాలోచించుకోవాలని విజ్ఞప్తి చేశారు. అప్పటికీ స్పందించకుంటే నోటాకి ఓటు వేయాలని పిలుపుని స్తామని హెచ్చరించారు. బ్రాహ్మణులు అన్ని నియోజకవర్గాల్లో స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేసేందుకు వెనకాడమని హెచ్చరించారు.

పాలీసెట్ దరఖాస్తులకు గడువు ఏప్రిల్ 5

కంచరపాలెం, మార్చి 30 : పాలిటెక్నిక్ కామన్ ఎంట్రన్స్ టెస్టు (పాలీసెట్) -2024 దరఖాస్తు గడువు ఏప్రిల్ ఐదో తేదీతో ముగియనున్నది. ఇంటర్, పదో తరగతి పరీక్షలు ఇటీవల ముగియడంతో దరఖాస్తులు భారీ సంఖ్యలో వస్తున్నాయి. ఈ నేపథ్యంలో పాలీసెట్‌కు ఆన్‌లైన్ దరఖాస్తు గడువు ఏప్రిల్ ఐదో తేదీ సాయంకాలం 5గంటల వరకు అవకాశం ఉంది. ఏప్రిల్ 27వ తేదీన ప్రవేశ పరీక్ష జరగనుంది.

రేపటి నుంచి ఉచిత శిక్షణతరగతులు...

కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజనీరింగ్ కళాశాలలో పాలీసెట్ దరఖాస్తుదారులకు ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ఉచిత శిక్షణ తరగతులను నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణ పేర్కొన్నారు. గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టుల్లో సీనియర్ అధ్యాపకులతో శిక్షణను అందించనున్నామన్నారు.

ఆస్తి పన్ను చెల్లింపు కేంద్రాల వద్ద రద్దీ

సీతంపేట, మార్చి 30: ఈ నెల 31వ తేదీలోగా ఆస్తి పన్ను కడితే వడ్డీ రాయితీ ప్రకటించడంతో జోన్ 3 జీవీఎంసీ కార్యాలయంలోని కౌంటర్ వద్ద జనం క్యూ కట్టారు. ఆదివారం కూడా ఆస్తి పన్ను చెల్లించే వీలుంది.

వైసీపీ సేవలో వలంటీర్లు

... 5వ పేజీ తరువాయి

అధికారులు, జిల్లా ఎన్నికల సంఘం కలిసి వలంటీర్లతో ఒక భారీ సమావేశం నిర్వహించాల్సిన అవసరం ఉంది. రాజకీయ పార్టీలకు అనుకూలంగా పనిచేసినా, వారితో కలిసి తిరిగినా విధుల నుంచి తొలగిస్తామని, తిరిగి తీసుకోబోమని స్పష్టంగా చెప్పాల్సి ఉంది. ఎవరైనా ప్రలోభాలకు గురిచేస్తే తమకు సమాచారం ఇవ్వాలని, వారిపై చర్యలు చేపడతామనో భరోసా కల్పించాల్సి ఉంది. ప్రత్యక్షంగా వారిని హెచ్చరించని పక్షంలో ఎన్నికల్లో అధికార పార్టీ తరపున వారు పనిచేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఇటువంటి సమయంలో ఎన్నికల సంఘం అండగా ఉంటుందని, ఏ వలంటీరు భయపడి వారికి పనిచేయాల్సిన అవసరం లేదని చెప్పాల్సిన బాధ్యత జిల్లా అధికారులపై ఉంది.

నిబంధనలు పట్టించుకోవద్దు

... 5వ పేజీ తరువాయి

సిద్ధం చేసి వారికి వివరించినట్టు తెలిసింది. మళ్లీ అధికారంలోకి వస్తామని, అప్పుడు అన్ని విధాలుగా మేలు చేస్తామని కూడా ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారంటున్నారు.

రాజయ్యపేట వలంటీర్ రాజీనామా

పెందుర్తి మండలం వాలిమెరక జుత్తాడ పరిధి రాజయ్యపేటకు చెందిన వలంటీరు సాయి రాజీనామా చేశాడని ఎంపీడీవో రవికుమార్ శనివారం తెలిపారు. పదిహేను రోజుల కిందటే సచివాలయ కార్యదర్శికి రాజీనామా లేఖ ఇచ్చాడని, అందులో తేదీ వేయకపోవడంతో ఇంతవరకూ ఆమోదించలేదన్నారు. ఈ వ్యవహారం తన దృష్టికి రావడంతో సిబ్బందిని మందలించి రెండు రోజుల కిందట రాజీనామాను ఆమోదించామన్నారు. అతను ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌కు అనధికారిక వ్యక్తిగత సహాయకుడిగా పనిచేస్తున్నట్టు సమాచారం. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తరువాత కూడా వైసీపీ ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్నాడని, దీనిపై ఆరోపణలు రావడంతోనే రాజీనామా చేశాడని సమాచారం.

పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్య దూరం

... 5వ పేజీ తరువాయి

ఏర్పడింది. హైకోర్టు ఆదేశాలతో గతంలో చేరిన విద్యార్థులకు మాత్రమే ప్రభుత్వం ఫీజులు చెల్లిస్తోంది. 2008లో ఈ పథకాన్ని ప్రారంభించగా, ఆ తరువాత వచ్చిన ప్రభుత్వాలు కొనసాగించాయి. ఈ స్కీమ్‌ను కొనసాగించడంతోపాటు ఫీజులను మరింత పెంచి ఉంటే జిల్లాలో సుమారు ఐదు వేల మంది విద్యార్థులకు ప్రైవేటు, కార్పొరేట్ స్కూల్స్‌లో చదువుకునే అవకాశం లభించి ఉండేదని విద్యార్థులు తల్లిదండ్రులు పేర్కొంటున్నారు.

పథకాన్ని పునరుద్ధరించాలి

- చింతాడ జోగారావు, దళిత హక్కుల సంఘం రాష్ట్ర ప్రెసిడెంట్

నిరుపేదలైన ఎస్సీ విద్యార్థుల కోసం బెస్ట్ అవైలబుల్ పథకాన్ని తీసుకువచ్చారు. ఈ పథకాన్ని వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేసింది. పోరాటం చేసినా పునరుద్ధరించ లేదు. ఉన్న వారికి కూడా ఆపేస్తామంటే కోర్టుకు వెళ్లాం. గతంలో చేరిన విద్యార్థులకు మాత్రమే ఈ పథకాన్ని కొనసాగిస్తున్నారు. అమ్మఒడి పేరుతో ఇచ్చే మొత్తానికి మరింత చేర్చి ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లలో నిరుపేదలైన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థులు ఉచితంగా చదువుకునే అవకాశాన్ని కల్పించాలి. ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. అమ్మఒడి పథకంలో భాగంగా ఇచ్చే మొత్తంతో కార్పొరేట్ స్కూళ్లలో చదువుకునే అవకాశం దక్కుతుందా?...ఈ విషయాన్ని ప్రభుత్వ పెద్దలే ఆలోచించాలి. ఈ పథకాన్ని పునరుద్ధరించిన వారిని గుర్తుంచుకుంటాం.

రికార్డు స్థాయిలో పన్ను వసూళ్లు

... 5వ పేజీ తరువాయి

ఖాళీ స్థలాల పన్ను కలిపి రూ.422.93 కోట్లు వసూలైంది. దీంతో పోల్చితే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.41 కోట్లు వరకూ అదనంగా వసూలవుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తంచేస్తున్నారు. ఈ నెల 31వ తేదీలోగా బకాయిలు (2023-24 ఆర్థిక సంవత్సరం మొదటి అర్ధ భాగానికి సంబంధించి పన్ను మొత్తం) చెల్లించిన వారికి వడ్డీ మాఫీ చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. దీనివల్ల ఆశించినదానికంటే అదనంగా పన్ను వసూలైందని జీవీఎంసీ అధికారులు విశ్లేషిస్తున్నారు. ఆదివారం సెలవు దినమైనప్పటికీ అన్ని జోనల్ కార్యాలయాలతోపాటు ప్రధాన కార్యాలయంలోని 'సౌకర్యం' కేంద్రాలు పనిచేస్తాయని డీసీఆర్ ఎస్.శ్రీనివాసరావు తెలిపారు.

'మోటారు చట్టం రద్దు చేయాలి'

ఎంవీపీ కాలనీ, మార్చి 30 : ఆటో డ్రైవర్ల జీవనోపాధికి నష్టం కలిగించే మోటారు చట్టం, జీవోలను రద్దు చేయాలని ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర సమితి డిమాండ్ చేసింది. శనివారం ఎంవీపీ కాలనీలోని కేఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఆ సంఘం జిల్లా కార్యవర్గం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పడాల గోవింద్, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ, ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. వామనమూర్తి మాట్లాడుతూ ప్రమాదాల నివారణ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబరు 21, 31 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే దశలవారీగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

భీమునిపట్నం (రూరల్), మార్చి 30 : పదవీ విరమణ చేసిన శొంఠ్యాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు ఎంవీజే గుప్తను భీమిలి డైట్ కళాశాల పూర్వ విద్యార్థులు శనివారం ఘనంగా సన్మానించారు. పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్థులు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో నాయకులు లెంక రాంబాబు, కోరాడ రమణారావు, పాఠశాల హెచ్ఎం జోగారావు, పంతం ఆదినారాయణ, పి. చంద్రరావు, ఎస్. కృష్ణారావు, బంటు అప్పారావు, చిలుకోటి శ్రీను, జమ్ము అప్పలనాయుడు ఎం. నర్సింగరావు, పీఆర్‌పీ వర్మ, లంక రమణ, తదితరులు పాల్గొన్నారు.

గంటాకు టికెట్ పట్ల హర్షం

తగరపువలస, మార్చి 30 : భీమిలి టీడీపీ అభ్యర్థిగా గంటా శ్రీనివాసరావును పార్టీ అధిష్ఠానం ప్రకటించడం పట్ల తగరపువలసకు చెందిన నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు ఒకటి, రెండు వార్డులకు చెందిన కార్యకర్తలు, నాయకులు శనివారం బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కూడలిలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

అప్పారావుకు ఏయూ డాక్టరేట్

మధురవాడ, మార్చి 30 : మధురవాడకు చెందిన పెంట అప్పారావు ఫిజిక్స్‌లో చేసిన పరిశోధనకు గాను ఏయూ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఈమేరకు వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరావు శనివారం తన కార్యాలయంలో అప్పారావుకు పీహెచ్‌డీ పట్టా అందించారు. ఆచార్యులు సమత, హనుమంతరావు పర్యవేక్షణలో ఇన్వెస్టిగేషన్ ఎయిమ్డ్ ఎట్ డెవలపింగ్ ఇన్ ఏక్యురేట్ కోబాల్ట్-జింక్ నానోఫెరైట్ కాంపోజిషన్ ఫర్ సెల్ఫ్ రెగ్యులేటెడ్ మేగ్నటిక్ హైపర్ థేమియా అన్న అంశంపై చేసిన పరిశోధనకు గాను డాక్టరేట్ ఇచ్చారు.

అంతర్జాతీయ గణిత సదస్సు ప్రారంభం

వెంకోజీపాలెం, మార్చి 30 : ఏయూలోని గణిత శాస్త్ర విభాగంలో శనివారం నుంచి ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ ప్యూర్, అప్లైడ్ అండ్ ఇంజనీరింగ్ మ్యాథమెటికల్ సైన్సెస్ అన్న అంశంపై అంతర్జాతీయ సదస్సు ప్రారంభమైంది. సదస్సుకు డైరెక్టర్‌గా గణిత శాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ పి. అనురాధ కామేశ్వరి అధ్యక్షత వహించారు.ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఉన్న ప్రొఫెసర్ సీహెచ్ శ్రీనివాసరావు సదస్సు ఆవశ్యకతను, సదస్సులో పాల్గొనే వక్తలు గురించి తెలియజేశారు.

మెరుగైన ఉపాధి అవకాశాలు

వెంకోజీపాలెం, మార్చి 30 : ఏయూ విద్యార్థులకు మెరుగైన ఉపాధి అవకాశాలు లభించడం పట్ల వీసీ ప్రసాదరెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. ఇటీవల ఏయూ సౌత్ క్యాంపస్‌లోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ స్టడీస్ ఇన్ ఎడ్యూకేషన్ (ఐఏఎస్ఈ)లో బీఈడీ, ఎంఈడీ చదువుతున్న విద్యార్థులకు క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. దీనికి 200 మంది హాజరుకాగా 170 మంది ఎంపికయ్యారు. వీరికి అత్యధిక వేతనంగా రూ.6.25 లక్షలు లభించనున్నట్టు వీసీ తెలిపారు.

ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి : వీసీ

వెంకోజీపాలెం, మార్చి 30 : యువత ఆత్మస్థైర్యంతో ముందుకు సాగితే విజయం సొంతమవుతుందని ఏయూ వీసీ ప్రసాదరెడ్డి అన్నారు. ఏయూ టీఎల్ఎన్ సభా మందిరంలో జర్నలిజం విభాగం ఆధ్వర్యంలో డిప్లమా ఇన్ ఫొటోగ్రఫీ కోర్సు పూర్తి చేస్తున్న విద్యార్థుల ఫొటోగ్రఫీ ప్రదర్శనను శనివారం ఆయన ప్రారంభించారు.

ఎన్నికల నియమావళి ఉల్లంఘనలపై ఫిర్యాదుల స్వీకరణ

వెంకోజీపాలెం, మార్చి 30 : తూర్పు నియోజకవర్గం పరిధిలో ఎన్నికల నియమావళి ఉల్లంఘనలపై ఫిర్యాదులు స్వీకరించనున్నట్టు జోన్-3 కమిషనర్ జె. విజయలక్ష్మి తెలిపారు. ఫిర్యాదుల కోసం 0891-2746314, 9154405435, 9154405462 ఫోన్ నంబర్లను సంప్రతించాలన్నారు.

సినిమా గైడ్

● **టిల్లు స్క్వేర్** : జగదాంబ, మెలోడి, శరత్, శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), మోహిని, లక్ష్మీకాంత్ (గాజువాక), అరుణ (పెదగంట్యాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1 (పెందుర్తి), శ్రీరాములమ్మ (తగరపువలస)

● **గాడ్జిల్లా వర్సెస్ కాంగ్** : శారద, శ్రీవెంకటేశ్వర, కామేశ్వరి, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్, మోహిని (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి)

● **ఆడుజీవితం** : శ్రీలీలామహల్, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), గణేష్ (తగరపువలస)

● **ఓం భీం బుష్** : సంగం, కామేశ్వరి, రమాదేవి, నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-2 (గాజువాక), తాతా (తగరపువలస)

● **ప్రేమలు** : శ్రీకన్య, దుర్గ (మధురవాడ), లక్ష్మీకాంత్ (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 23, టమాటా 18, వంకాయలు (తెలుపు) 22, వంకాయలు (నలుపు) 22, బెండకాయలు 22, పచ్చిమిర్చి 44, కాకరకాయలు 34, బీరకాయలు 40, ఆనపకాయలు 12, కాలీఫ్లవర్ 22, క్యాబేజ్ 22, క్యారెట్ 28, దొండకాయలు 20, బంగాళా దుంపలు 20, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 36, అల్లం (పాతది) 150, బరబటి 26, ముల్లంగి 16, నిమ్మకాయలు (కిలో) 90, గోరుచిక్కుడు 30, దోస కాయలు 16, వెల్లుల్లి (పెద్దవి) 160, కొబ్బరికాయ (పెద్దది) 22, బీన్స్ (పెన్సిల్) 54, ఆగాకర 52, పొటల్స్ 46, కీరదోస 24, కాప్సికమ్ 64, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 40, చిలగడదుంపలు 30 , కంద 60, దేముడు చిక్కుడు 64, కొండఉసిరి 90, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 55, బూడిద గుమ్మడికాయ 30, క్యాప్రెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 40.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	415
విజయనగరం	419
శ్రీకాకుళం	419

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	107
ఫారం ధర	--	127
విత్ స్కిన్	--	224
స్కిన్‌లెస్	--	234

మరికొన్ని సిటీ వార్తలు పేజీ I లో..



సభలో మాట్లాడుతున్న గంటా శ్రీనివాసరావు



తొలిపావంచా వద్ద గంటా పూజలు

భీమిలిని ఆదర్శంగా తీర్చిదిద్దుతా

- పంచ గ్రామాల భూ సమస్యను పరిష్కరిస్తా
- టీడీపీ అభ్యర్థి గంటా శ్రీనివాసరావు

సింహాచలం, మార్చి 30 : ఎన్నికల్లో తనను గెలిపిస్తే భీమిలి నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతానని మాజీ మంత్రి, భీమిలి టీడీపీ అభ్యర్థి గంటా శ్రీనివాసరావు తెలిపారు. శనివారం ఆయన తన అనుచరులతో కలిసి వరాహలక్ష్మీనృసింహ స్వామిని దర్శించుకోవడంతో పాటు కొండదిగువ తొలిపావంచా వద్ద ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల్లో గెలుపునకు తాజాగా ఏర్పాటు చేస్తున్న పార్టీ కార్యాలయంలో అన్ని వర్గాలతో చర్చించి సమగ్ర ప్రణాళికతో ప్రచారం సాగిస్తామన్నారు. గత ఐదేళ్లుగా రాష్ట్రం అన్ని విధాలా నాశనమైందని, ఉమ్మడి ప్రభుత్వం ఏర్పాటుతో రాష్ట్రానికి తిరిగి పూర్వ వైభవం వస్తుందన్నారు. నియోజకవర్గంలోని సమస్యలపై చాలావరకు అవగాహన ఉందని, మేధావులు, ప్రజలు, నేతలతో ప్రత్యేక కూటమి ఏర్పాటు చేసి పరిష్కారానికి చర్యలు తీసు కుంటానని హామీ ఇచ్చారు. శాటిలైట్ టౌన్‌షిప్ నియోజకవర్గ పరిధిలో ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. అలాగే నియోజకవర్గం అభివృద్ధికి ప్రత్యేక మేనిఫెస్టో విడుదల చేసే యోచనలో ఉన్నట్టు పేర్కొన్నారు.పంచ గ్రామాల భూ వివాద పరిష్కారానికి చంద్రబాబు నాయకత్వంలోని తమ ప్రభుత్వం కృషి చేసినప్పటికీ న్యాయపరమైన చిక్కుల వల్ల సాధ్యం కాలేదని, తమ ప్రభుత్వం ఏర్పాటు తరువాత సమస్యను పరిష్కరించి తీరుతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 98వ వార్డు కార్పొరేటర్ పివి నరసింహం, వార్డు టీడీపీ అధ్యక్షుడు పంచదార్ల శ్రీనివాస్, బీసీ విభాగం అధ్యక్షుడు గంధ్రెడ్డి వెంకటరమణ, గుసిడి అవినాష్‌బాబు, రౌతు రాంబాబు, మేకా కాసుగోపాల్, పట్నాల ధర్మరాజు, శిరిపురపు సురేష్ పాల్గొన్నారు. కాగా అంతకముందు గంటా భైరవస్వామికి కూడా పూజలు చేశారు.

మరోసారి అత్యధిక మెజారిటీతో గెలుస్తా

భీమునిపట్నం : భీమిలి నియోజకవర్గ ప్రజల సంకల్ప బలం, దైవ బలమే తనకు మరోసారి ఈ స్థానం నుంచి పోటీ చేసే అవకాశం కలిగించాయని మాజీ మంత్రి, టీడీపీ అభ్యర్థి గంటా శ్రీనివాసరావు అన్నారు. భీమిలి టికెట్ ఖరారైన తర్వాత తొలిసారిగా ఆయన పట్టణానికి వచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇక్కడి ప్రజలు 2014 ఎన్నికల్లో తనను సుమారు 38 వేల ఓట్ల మెజారిటీ గెలిపించారని, ఈసారి అంతకంటే ఎక్కువ మెజారిటీతో గెలుస్తానని చెప్పారు.



పాదయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే వెలగపూడి, తదితరులు

చంద్రబాబుతోనే సుపరిపాలన : వెలగపూడి

ఆరిలోవ, మార్చి 30 : టీడీపీ అధినేత చంద్రబాబుతోనే రాష్ట్ర ప్రజలకు సుపరిపాలన అందుతుందని తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు అన్నారు. శనివారం ఆయన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో కలిసి 12వ వార్డులోని పెదగదిలి నుంచి చినగదిలి సాయిబాబా గుడి వరకు పాదయాత్ర నిర్వ హించారు. ఈ సందర్భంగా వెలగపూడి ఇంటింటికి వెళ్లి చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఎన్నికల్లో చంద్రబాబును ముఖ్యమంత్రిగా, తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో 12వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి ఒమ్మి అప్పలరాజు, అధ్యక్షుడు గాడి సత్యం, కార్యదర్శి భరత్, పార్లమెంటరీ కార్యదర్శి ఒమ్మి పోలారావు, ఏడువాక సన్యాసిరావు. 9వ వార్డు ఇన్‌చార్జి బుడుమూరు గోవింద్, దువ్వి తాతారావు, ఈశ్వరరావు, నంబారు గోపి, జనసేన నాయకులు దూళి రఘు, బీజేపీ నాయకుడు సత్యాన్నారాయణ పాల్గొన్నారు.

ఉమ్మడి అభ్యర్థుల విజయమే లక్ష్యం

- ఉత్తర బీజేపీ అభ్యర్థి విష్ణుకుమార్ రాజు



విష్ణుకుమార్‌రాజును సత్కరించి పుష్పగుచ్ఛం అందిస్తున్న వంశీకృష్ణ

మద్దిలపాలెం, మార్చి 30 : జిల్లాలో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని ఉత్తర నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి విష్ణుకుమార్‌రాజు పిలుపునిచ్చారు. శనివారం ఆయన శివాజీపాలెంలో జనసేన అర్బన్ అధ్యక్షుడు, దక్షిణ జనసేన అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఒకరికొకరు తమ మద్దతు తెలియజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ జిల్లాలోని ఏడు నియోజకవర్గాలను కైవసం చేసుకుని టీడీపీ, జనసేన, బీజేపీ జెండాలు ఎగురవేయాలన్నారు. కాగా 30వ వార్డుకు చెందిన యువత వంశీకృష్ణశ్రీనివాస్ సమక్షంలో జనసేనలో చేరారు. ఈ కార్యక్రమంలో వీర మహిళ యజ్ఞశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

వడ్డీ మాఫీ గడువు నేటితో పూర్తి : కమిషనర్

వెంకోజీపాలెం, మార్చి 30 : జీవీఎంసీ పరిధిలోని ఆస్తి, ఖాళీ స్థలాల పన్నుపై వడ్డీ మాఫీ గడువు ఆదివారంతో ముగియనున్నట్టు కమిషనర్ సాయికాంత్ వర్మ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తి, ఖాళీ స్థలాలపై మొత్తం పన్నులను ఈనెలా ఖరులోగా ఒకేసారి చెల్లిస్తే వడ్డీ మాఫీ పొందవచ్చునని చెప్పారు. పన్ను చెల్లింపుదారుల సౌకర్యార్థం ఆదివారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంతో పాటు అన్ని జోనల్ కార్యాలయాలు ఉదయం 7 నుంచి రాత్రి 11 గంటల వరకు పనిచేస్తాయన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

యువకుడ్ని రక్షించిన లైఫ్‌గార్డులు

సాగర్‌నగర్, మార్చి 30 : రుషికొండ బీచ్‌లో సముద్ర స్నానానికి దిగి ప్రమాదానికి గురైన యువకుడ్ని లైఫ్ గార్డులు రక్షించారు. హైదరాబాద్‌లోని వనపర్తికి చెందిన 11 మంది కుటుంబ సభ్యులు విహార యాత్ర కోసం శనివారం రుషికొండ బీచ్‌కు వచ్చారు. వారంతా సముద్ర స్నానాలు చేస్తుండగా కయ్యుమ్ (21) అనే యువకుడు కెరటాల్లో కొట్టుకుపోతుండడంతో మిగతా వారు గమనించి గట్టిగా కేకలు వేశారు. దీంతో సమీపంలో విధులు నిర్వర్తిస్తున్న లైఫ్‌గార్డులు కయ్యుమ్‌ను ప్రాణాలతో సురక్షితంగా రక్షించి ఒడ్డుకి చేర్చారు. మెరైన్ పోలీసులు యువకుడికి కౌన్సిలింగ్ ఇచ్చారు.

వార్డుల్లో ఇంకుడు గుంతలు

వెంకోజీపాలెం, మార్చి 30 : ఆంధ్రప్రదేశ్ నివాసితుల సంఘాల సంక్షేమ సమాఖ్య (ఏపీ ఫెర్వాస్) ఆధ్వర్యంలో నగరంలోని 150 కాలనీల్లో ఇంకుడు గుంతలు తవ్వే కార్యక్రమం చేపడుతున్నట్టు సమాఖ్య అధ్యక్షుడు డాక్టర్ కె.ఎస్.ఆర్. మూర్తి తెలిపారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గాజువాక నుంచి మధురవాడ వరకు విస్తరించి ఉన్న 150 కాలనీల్లో కాలనీకి ఐదు చొప్పున ఇంకుడు గుంతలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. మొత్తం 150 కాలనీల్లో 750 ఇంకుడు గుంతలు ఏర్పాటవుతాయని వచ్చే రెండు నెలల్లో ఈ పనులను పూర్తి చేయనున్నట్టు తెలిపారు. గుంతలను ఎలా తవ్వుకోవాలో కాలనీ నిర్వాహకులకు తెలియజేశామన్నారు.

రిటైర్డ్ ఉద్యోగులకు సన్మానం

వెంకోజీపాలెం, మార్చి 30 : రిటైర్డ్ ఉద్యోగులు శేష జీవితాన్ని ఆనందదాయకంగా గడపాలని జీవీఎంసీ అడ్మినిస్ట్రేటివ్ అధికారి పి. పద్మజ అన్నారు. శనివారం ఆమె కమిషనర్ సాయికాంత్‌వర్మ ఆదేశాల మేరకు జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో పదవీ విరమణ పొందిన ఐదుగురు ఉద్యోగులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎంఈఎస్ఏ, జేమ్స్ అధ్యక్షుడు అప్పలనాయుడు, కార్యవర్గ సభ్యులు అప్పలరాజు, పర్యవేక్షకులు రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

మీడియాపై జెడ్పీ వైస్ ఛైర్మన్ అనుచిత వ్యాఖ్యలు

పద్మనాభం, మార్చి 30 : మండలంలోని విజయానందపురంలో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో జెడ్పీ వైస్ ఛైర్మన్ సుంకర గిరిబాబు మీడియాపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. గతంలో ల్యాండ్‌పూలింగ్‌లో పేదలకు దక్కాల్సిన ప్రతిఫలాన్ని తాను కాజేసిన వ్యవహారంపై పత్రికల్లోను, ఛానళ్లలోను వరుస కథనాలు రావడంతో అది మనసులో పెట్టుకొని తరచూ విలేఖర్లను చులకనగా మాట్లాడడం అలవాటై పోయింది. ఈమేరకు ఎన్నికల ప్రచారంలో మీడియాపై తన అక్కసు వెళ్లగక్కారు. టీడీపీ అభ్యర్థి గంటాపై విమర్శలు చేస్తూ ఇటువంటి వ్యక్తికి డబ్బా పత్రికలు, డబ్బా ఛానళ్లు, తొక్క ఛానళ్లు మద్దతు పలుకుతూ తమ ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నాయని, వాటికి తాము భయపడమని ఘాటైన పదజాలంతో వ్యాఖ్యానించారు.ఈ మాటలు విన్న ప్రజలు ఎన్నికల ప్రచారం మాని మీడియాపై వ్యాఖ్యలు చేయడమేమిటని ముక్కున వేలేసుకున్నాయి.



విజయానందపురంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి



ఇంటింటికి కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

అన్ని వర్గాల సంక్షేమమే వైసీపీ లక్ష్యం : ముత్తంశెట్టి

పద్మనాభం, మార్చి 30 : పార్టీలకు అతీతంగా అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలను అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు దక్కుతుందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. శనివారం ఆయన విజయానందపురం, నేరేళ్లవలస, చిన్నాపురం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తనను అభిమానించి ఓట్లు వేసిన వారికి, తనకు వ్యతిరేకంగా ఓటు వేసిన వారికి సైతం ఎటువంటి వివక్ష చూపకుండా సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి అందిస్తున్నారన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ఇంటి ముంగిటకే అన్ని రకాల సేవలు అందుతున్నాయని చెప్పారు. జగన్ మళ్లీ సీఎం అయితేనే ప్రస్తుతం అమలవుతున్న పథకాలు, గ్రామ సచివాలయ వ్యవస్థ, వలంటరీ వ్యవస్థ అమలవుతాయన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే వాటన్నింటినీ చంద్రబాబు తొలగిస్తారని హెచ్చరించారు. పద్మనాభం మండలంలో అనంతుని గిరికి నిధులతో పాటు పాండ్రంగిలో గోస్తనీ నదిపై వంతెన, అయినాడ-రేవిడి రోడ్డు విస్తరణ, రెడ్డిపల్లి-పద్మనాభం రోడ్డు విస్తరణ పనులకు రూ.50 కోట్ల వరకు మంజూరు చేశామన్నారు. ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా, బొత్స ఝాన్సీని ఎంపీగా గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్థానిక పరదేశమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ ఛైర్మన్ గిరిబాబు, ఎంపీపీ రాంబాబు, వైసీపీ మండల అధ్యక్షుడు కె. రాంబాబు, ఇతర నాయకులు బంగారప్పడు, సూర్యనారాయణ, శంకరరావు, సూరిబాబు పాల్గొన్నారు.

జంతు పునరావాస కేంద్రంలో ఎలుగుబంటి మృతి ?

ఆరిలోవ, మార్చి 30 : నగరంలోని జూపార్కులో ఇటీవల వరుసగా జంతువులు మృతి చెందుతుండడం ఆందోళన కలిగిస్తోంది. జూపార్కు సమీపంలోని జంతు పునరావాస కేంద్రంలో ఉన్న మగ ఎలుగుబంటి శనివారం ఉదయం అనారోగ్యంతో మృతి తెలిసింది. ఈ విషయం బయటకు రాకుండా అధికారులు గోప్యత పాటించారు. సుమారు 20 ఏళ్ల ఉన్న ఈ ఎలుగుబంటిని రెండు నెలలు క్రితం శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరు అటవీ ప్రాంతం నుంచి అధికా రులు బంధించి తీసుకువచ్చారు. అప్పటి నుంచి దీన్ని జంతు పునరావాస కేంద్రంలో వైద్యుల సంరక్షణలో ఉంచారు. కానీ దీనికి సరైన వైద్యం అందించకపోవడంతో మృతి చెందినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిన్న జిరాఫీ, అంతకుముందు జీబ్రా, అలాగే మరో జీబ్రా, చింపాంజీ ఇలా వరుసగా జంతువులు మృతి చెందుతుండడంతో జంతు ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర అటవీ శాఖ పీసీసీఎఫ్ చిరంజీవి చౌదరి జంతు పునరావాస కేంద్రంతో పాటు జూపార్కును సందర్శించినట్టు తెలిసింది. అన్ని మోటులను తిరిగి జంతువుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. జంతువులు ఒక దాని తరువాత ఒకటి మృతి చెందుతుండడంతో అధికా రులు, సిబ్బంది నిర్లక్ష్యంపై ఆగ్రహం వ్యక్తం చేసినట్టు సమాచారం.

భీమిలి టికెట్‌పై అధిష్ఠానం పునరాలోచన చేయాలి

- టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కోరాడ రాజబాబు



ఆనందపురం, మార్చి 30 : టీడీపీ అధిష్ఠానం గంటా శ్రీనివాసరావుకు భీమిలి టికెట్ ఏవిధంగా ప్రకటించిందో అర్థం కావడం లేదని, ఈ విషయమై అధిష్ఠానం పునరాలోచన చేయాలని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కోరాడ రాజబాబు కోరారు. శనివారం ఆయన తన అనుచరులతో ఆనందపురంలోని తన నివాసంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధిష్ఠానం మూడు రోజుల్లో టికెట్ మార్చని పక్షంలో తన భవిష్యత్ కార్యచరణ ప్రకటిస్తానని చెప్పారు.

దేశ పురోభివృద్ధిలో మేనేజ్‌మెంట్ స్టడీస్ కీలకం

సాగర్‌నగర్, మార్చి 30 : దేశ పురోభివృద్ధిలో మేనేజ్‌మెంట్ స్టడీస్ కీలక పాత్ర పోషిస్తున్నాయని ఫార్మా స్యూటికల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ గిరీష్ దీక్షిత్ అన్నారు. గాయత్రి విద్యా పరిషత్ కాలేజ్ ఫర్ డిగ్రీ, పీజీ కళాశాలలో శనివారం అస్త్రా-2024 పేరుతో జాతీయ స్థాయి మేనేజ్‌మెంట్ స్టూడెంట్స్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా భారత దేశానికి చెందిన ఫార్మా స్యూటికల్ పరిశ్రమలు దూసుకుపోతుండడ, వాటి విజయానికి కీలకమైన నిర్వహణ వ్యూహాలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సుంకరి రజని, ఎంబీటీ విభాగాధిపతి డాక్టర్ కె.ఎస్. బోస్, కోకన్వీనర్లు మోహిని, జోగారావు, తదితరులు పాల్గొన్నారు.

ఏడుగురు వలంటీర్ల తొలగింపు

పద్మనాభం, మార్చి 30 : మండలంలోని గంధవరంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఏడుగురు వలంటీర్లను విధుల నుంచి తొలగించినట్టు ఎంపీడీఓ బి. శైలజ చెప్పారు. ప్రచారంలో పాల్గొన్న వలంటీర్లు కె. రమాకుమారి, టి. జగదీష్, కె. శేఖర్, సీహెచ్ లక్ష్మి, పి. ముత్యాలనాయుడు, పి. ముత్యాలు, కె. అప్పలరాజును విధుల నుంచి తొలగించామన్నారు. రిటర్నింగు అధికారి ఆదేశాల మేరకు వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయమని పోలీసులకు నివేదించామని చెప్పారు. కాగా వలంటీర్లతో పాటు మజ్జివలస వీఏసీఎస్ ఉద్యోగి రామకృష్ణపై కూడా కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

విద్యార్థిని మృతిపై కొనసాగుతున్న విచారణ

కొమ్మాది, మార్చి 30 : నగర పరిధిలోని కొమ్మాది చైతన్య పాలిటెక్నిక్ కళాశాలలో చదువుతున్న విద్యార్థిని బలవన్మరణంపై పీఎం పాలెం పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. బాలిక మృతికి కారణమైన గురువు ఎవరు, ఆయనకు సహకరించిన విద్యార్థులు, బాలిక ఫొటోలు ఎప్పుడు, ఎవరు, ఎలా తీశారు వంటి విష యాలను ఆరా తీస్తున్నారు. అలాగే బాలికతో పాటు ఇంకా ఎంతమంది లైంగిక వేధింపులకు గురవుతున్నా రన్నది కూడా విచారిస్తున్నారు. విద్యార్థిని ఆత్మహత్యపై అన్ని పత్రికల్లోనూ రావడంతో పోలీసు ఉన్నతాధికారు లు కూడా ఈ కేసుపై దృష్టి సారించారు. కళాశాల అధ్యాపకులతో పాటు హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థినులను, ల్యాబ్ టెక్నీషియన్లను స్టేషన్‌కు పిలిపించి విచారిస్తున్నారు. బాలికతో హాస్టల్‌లో ఉంటున్న వారిని కళాశాల హాస్టల్ వద్ద ఎస్ఐ సునీత విచారించగా, తరగతులు బోధించే అధ్యాపకులు, ల్యాబ్ టెక్నీషియన్లు, హాస్టల్ సిబ్బందిని పీఎంపాలెం స్టేషన్‌లో ఎస్ఐ సురేష్ విచారిస్తున్నారు. బాలికను ఇద్దరు విద్యార్థులు తరచూ కలిసేవారని, వారు బాలురు వసతి గృహంలో ఉంటారని సమాచారం లభించడంతో పోలీసులు వారిని కూడా విచారిస్తున్నారు. తరగతులు బోధించే వారిలో ఇద్దరు మాత్రమే పురుషులు కాగా ఐదుగురు మహిళలు ఉన్నారు. వారందరి ఫోన్లను స్వాధీనం చేసుకుని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. కాగా బాలిక ఆత్మహత్యకు కారణమైన వారిని కఠినంగా శిక్షించాలంటూ పీడీఎస్ఓ ఆధ్వర్యంలో శనివారం చైతన్య కళాశాల వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పి.విశ్వనాథ్ మాట్లాడుతూ కళాశాల యాజమాన్యం, పోలీసులు చెబుతున్న విషయాల్లో వాస్తవం కనిపించడం లేదన్నారు. బాలిక ఆత్మహత్యపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

అప్పన్నను దర్శించుకున్న ప్రముఖులు



భక్తులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ మల్లికార్జున

సింహాచలం, మార్చి 30 : వరాహలక్ష్మీనృసింహస్వామిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకుని, సింహగిరిపై జరుగుతున్న మహాయజ్ఞంలో పాల్గొన్నారు. స్వామివారిని దర్శించుకున్న వారిలో మాజీ మంత్రి, ఉత్తర ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు, భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, జిల్లా కలెక్టర్ డా.ఎం మల్లికార్జున, దేవదాయశాఖ రాష్ట్ర అదనపు కమిషనర్, అన్నవరం వీర వెంకట సత్యనారాయణస్వామి దేవస్థానం ఈఓ కొడూరి రామచంద్రమోహన్, తదితరులు ఉన్నారు. కాగా కలెక్టర్ మల్లికార్జున యజ్ఞం పూర్ణాహుతి తరువాత దేవస్థానం ఏర్పాటు చేసిన అన్నప్రసాద విభాగంలో సాధారణ భక్తులతో కలిసి సహపంక్తిలో కూర్చుని స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

నేడు 'మన పోలింగ్ బూత్-మన ఓటు'

భీమునిపట్నం, మార్చి 30 : ఎన్నికల్లో ఎక్కువ మంది ఓటుహక్కు వినియోగించుకోవాలన్న ఉద్దేశంతో ఆదివారం మన పోలింగ్ బూత్-మన ఓటు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు భీమిలి నియోజకవర్గ ఎన్నికల అధికారులు తెలిపారు. ఈమేరకు శనివారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. నియోజకవర్గంలోని బూత్ లెవల్ అధికారులు, సూపరువైజర్లు వారి వారి పోలింగ్ బూత్‌ల వద్ద లేదా జన సంఖ్య ఎక్కువగా వున్న ప్రాంతాల్లో ప్రజలకు ఓటు నమోదైన సంఖ్య, వారి పోలింగ్ కేంద్రం వివరాలు తెలియజేయాలని ఆదేశించారు.

సుదర్శన నృసింహ యాగానికి పోటెత్తిన భక్తులు





పూర్ణాహుతి సమర్పిస్తున్న రుత్విక్‌లు, పాల్గొన్న భక్తులు

సింహాచలం, మార్చి 30: స్వాహా అంటూ మంత్ర యుక్తంగా అగ్నిముఖంగా చేసే యజ్ఞయాగాదుల ద్వారా భగవంతునికి భక్తుల కోర్కెల నివేదన జరుగుతుందని, అవి భగవంతునికి సన్నిధికి చేరి సత్ఫలితాలిస్తాయని స్థానాచార్యులు డా.టీపీ రాజగోపాల్ అన్నారు. సింహగిరిపై జరుగుతున్న చతుర్వేద హవన పూర్వక పాంచాహ్నిక పంచకుండాత్మ శ్రీసుదర్శన నారసింహ మహాయజ్ఞం నాల్గో రోజైన శనివారం పాల్గొన్న ఉభయ దాతలు(భక్తులు)ను ఉద్దేశించి ఆయన ప్రవచించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాత ఆరాధనలు నిర్వహించారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ఊరేగింపుగా యాగశాలకు తీసుకువచ్చి ప్రత్యేక వేదికలపై అధిష్ఠింపజేశారు. ఉభయదాతలకు రాగిమాడను అందజేసి గోత్రనామాలతో సంకల్పించి పూజలు జరిపించారు. యజ్ఞశాలలోని హోమకుండాలలో ప్రత్యేక హవనాన్ని జరిపారు. భక్తులతో నృసింహ, సుదర్శన మంత్రాలను పలికించారు. లఘుపూర్ణాహుతి చేసి గోవిందరాజస్వామి సన్నిధిలో విన్నపాలు గావించి మంత్రపుష్పం, మంగళ నీరాజనాలు సమర్పించారు. భక్తులకు వేదాశీర్వచనాలు, శేష వస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు. కాగా వరాహలక్ష్మీ నృసింహస్వామికి శనివారం సాయంత్రం హనుమత్ వాహనంపై మాడవీధుల్లో తిరువీధి నిర్వహించారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామి, ఉభయ దేవేరులను అలంకరించి హనుమత్ వాహనంపై అధిష్ఠింపజేశారు. మహిళల కోలాటాల మధ్య తిరువీధి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దేవాలయ చరిత్రలో హనుమత్ వాహనాన్ని వినియోగించటం ఇదే తొలిసారి కావడం ప్రాధాన్యత సంతరించుకుంది.



హనుమత్ వాహనంపై గోవిందరాజస్వామి